RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers



హైదరాబాద్ | 8 జనవరి 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:184


## సీఎం కప్-2025 సెకండ్ ఎడిషన్ పోస్టర్ ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి )** సీఎం కప్-2025 సెకండ్ ఎడిషన్ పోస్టర్ ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి . పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, SATG ఎండీ సోనీబాల.ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామ స్థాయి, 28 నుంచి31 వరకు మండల స్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయి, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయి, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు. మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్న SATG.

## రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి పై కేటిఆర్ చేసిన వ్యాఖ్యల పై ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఫైర్


వార్తా 2 లో


## పంతం నెగ్గించుకున్న కవిత




వార్తా 2 లో


## రాష్ట్రంలో రాజకీయ శూన్యత లేదు, కాబట్టి కొత్త పార్టీలకు మనుగడ కష్టమే.."




వార్తా 3 లో


## 19వ రాజీవ్ గాంధీ అండర్-19 ఆల్ ఇండియా క్రికెట్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం





**అంబర్‌పేట్ ప్రజాబలంప్రతినిధి:**అంబర్‌పేట వాటర్ వర్క్ గ్రౌండ్‌లో బుధవారం 19వ రాజీవ్ గాంధీ అండర్-19 ఆల్ ఇండియా క్రికెట్ ఛాంపియన్‌షిప్ ఘనంగా ప్రారంభమైంది. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వి. హనుమంతరావు ఆధ్వర్యంలో, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆది అవినాష్, ప్రధాన కార్యదర్శి శంబుల శ్రీకాంత్ గౌడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.టోర్నమెంట్‌ను రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, మాజీ భారత క్రికెట్ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ, గత 19 ఏళ్లుగా ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌ను నిరంతరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫైనల్ మ్యాచ్ ఈ నెల 10న సాయంత్రం ఎల్‌బీ స్టేడియంలో జరుగుతుందని, రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఫైనల్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. సీఎం స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభిస్తామని ప్రకటించడం అభినందనీయమని అన్నారు.పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, హనుమంతరావు గత 19 సంవత్సరాలుగా ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించడం ప్రశంసనీయమని, రాజీవ్ గాంధీతో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధాలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో అంబర్‌పేట కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ సి. రోహిన్ రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, గణేష్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే. శివసేన రెడ్డి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, ఖైరతాబాద్ డిస్ట్రిక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుమోతా రోహిత్ ముదిరాజ్, టీజీఎంఈఆర్ఐఈఎస్ అధ్యక్షుడు ఫహీమ్ ఖురేషి, జాతీయ సిఎఫ్ఐ అధ్యక్షుడు హైయెస్ట్ సాదిక్ పాషా, ప్రధాన కార్యదర్శి అమరజీత్ కుమార్, టెక్నికల్ సెక్రటరీ రజినీకాంత్, మాజీ కార్పొరేటర్లు తో పాటు పలువురు నాయకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## మేడారంలో జరుగుతున్న అభివృద్ధి, సౌకర్యాల పనుల్లో వేగం పెంచాలి.

### మేడారం లో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిశీలన. మంత్రి ధనసరి అనసూయ సీతక్క








**ప్రజాబలం ములుగు జిల్లా ప్రతినిధి జనవరి 07 :** జాతర సమీపిస్తుండటంతో మేడారంలో జరుగుతున్న అభివృద్ధి, సౌకర్యాల పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.బుధవారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కెకాన్, ఐ టి డి ఏ పీవో చిత్ర మిశ్రాలతో కలిసి మేడారం మ్యూజియం, చిలకలగుట్ట, ఊరట్టం కాజ్ వే, జంపన్న వాగు పరిసర ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ శుక్రవారం లోపు ఆర్చ్ పిల్లర్లు, సంబంధిత నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారి పర్యటన సందర్భంగా మేడారంలో సభ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించి ఏర్పాటు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు ముక్కులు చెల్లించుకోవడానికి వస్తున్న భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా దర్శనాలు కల్పించాలని, ప్రతి పనిని గడువులోగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.మేడారం జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి కావాలని, ప్రతి శాఖ బాధ్యతగా పనిచేయాలనిమంత్రి స్పష్టం చేశారు. భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా అధికారులు ముందుకు సాగాలని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సముద్రంలో కలిసే నీటిని వాడుకుంటే తప్పేంటి.. ప్రశ్నించిన చంద్రబాబు



అమరావతి జనవరి 7 ;: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నెలకొన్న నీళ్ల వివాదంపై ఎపి సిఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. సముద్రంలో కలిసే నీటిని వాడుకుంటే తప్పేంటి అని ప్రశ్నించారు. నీళ్లపై రాజకీయాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. గోదావరి నీళ్లు మంజీరాకు తీసుకెళ్తే తాము అడ్డుకోలేదని తెలిపారు. గోవాదరిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయన్నారు. నీళ్ల విషయంలో పోటీపడి మాట్లాడటం సరికాదని.. ప్రజలంతా ఆలోచించాలని అన్నారు. ప్రజల మధ్య విబేధాలు సృష్టించి ఆనందపడొద్దని హితవు పలికారు.

## సంక్రాంతి పండుగకు 6,431 ప్రత్యేక బస్సులు

### ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూళ్లకు టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయం

### సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచితమ్





హైదరాబాద్ జనవరి 7 సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. పండుగకు 6,431 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 9, 10, 12, 13 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో దానికి అనుగుణంగా ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ప్రణాళికను సిద్ధం చేసింది.ఈ నెల 18, 19 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయినపల్లి , గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తుంది.సంక్రాంతి పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయని సంస్థ వెల్లడించింది. ఈ నెల 9, 10, 12,13 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 18, 19 తేదీల్లో మాత్రమే సవరించిన ఛార్జీలు అమల్లో ఉంటాయని, స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ ఛార్జీలే అమల్లో ఉంటాయని వెల్లడించింది.రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని వివరించింది. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను ఒఒఒ.్ర్తంతీఎఎబం.ఱఅ వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని సూచించింది.

ప్రజాబలం

8 జనవరి 2026 గురువారం

# డాలర్‌ను సవాలు చేస్తే అంతేనా...

వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను బంధించి సంకెళ్లతో తీసుకెళ్లడం చూస్తుంటే సరిగ్గా 22- 23 ఏళ్ళ క్రితం ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుసేన్‌పై దాడి చేసి, ఆ తర్వాత ఉరితీసిన అమెరికా దుశ్చర్య గుర్తుకు వస్తుంది. సద్దాం జీవాయుధాలు తయారు చేస్తున్నాడనే ఆరోపణతో యుద్ధానికి దిగిన అమెరికా అందుకు ఎటువంటి ఆనవాళ్లను ఇప్పటివరకు చూపలేకపోయింది. ఇప్పుడు కూడా అమెరికా వెనెజువెలాపై దాడిచేయడానికి అసలు కారణం 1974లో సౌదీఅరేబియాతో హెన్రీ కిస్సింజర్ చేసుకున్న ఒప్పందం. ఇది వాస్తవానికి అమెరికా డాలర్ మనుగడ గురించి అని మాత్రం స్పష్టం అవుతుంది. ట్రంప్ చెబుతున్నట్లు మాదకద్రవ్యాలు, ఉగ్రవాదం, ప్రజాస్వామ్యం వంటి కారణాలు ఏవీకావు. ఇది 50 సంవత్సరాలుగా అమెరికాను ఆధిపత్య ఆర్థికశక్తిగా ఉంచిన పెట్రోడాలర్ వ్యవస్థను కాపాడుకోవడం కోసమే అని గ్రహించాలి. వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్‌ను కూడా తమ మాట వినకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం గమనార్హం. అమెరికా బెదిరించి, బలప్రయోగం చేసి డాలర్లతో అంతర్జాతీయ వాణజ్యం జరిగేటట్లు చూస్తూ ప్రపంచంలో సంపన్న దేశంగా చెలామణి అవుతుంది. ఎప్పుడైతే యూరోలో చమురు వాణజ్యం చేస్తానని సద్దాం ప్రకటించారో తన ఆర్థిక వ్యవస్థ కూలిపోతుందని అమెరికా భయపడింది. ఇపుడు కూడా మదురో ఇతర కరెన్సీలలో చమురు వాణిజ్యం చేయడం ప్రారంభించింది అమెరికా భయపడిపోయింది. అందుకనే వెనిజులాను అంతం చేస్తామని ట్రంప్ బెదిరించారు.వెనిజులాలో 303 బిలియన్ బారెల్స్ నిరూపితమైన చమురు నిల్వలు ఉన్నాయి. సౌదీ అరేబియా కంటే ఎక్కువ. మొత్తం ప్రపంచ చమురులో 20 శాతం. వెనెజువెలా ఆ చమురును చైనీస్ యువాన్‌లో చురుకుగా అమ్ముతోంది. డాలర్లలో కాదు. 2018లో వెనెజువెలా డాలర్ నుండి విముక్తి పొందుతామని ప్రకటించింది. వారు యువాన్, యూరోలు, రూబిళ్లు, చమురుకు డాలర్లు తప్ప మరేదైనా అంగీకరించడం ప్రారంభించారు.పైగా, బ్రిక్స్‌లో సభ్యతం కోసం దరఖాస్తుకు సిద్ధమయ్యారు. స్విఫ్ట్‌ను పూర్తిగా దాటవేస్తూ చైనాతో ప్రత్యక్ష చెల్లింపు మార్గాలను నిర్మిస్తున్నారు. వారు దశాబ్దాలుగా డాలర్ ఆధిపత్యం తొలగించేందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి తగినంత చమురు నిల్వలు వారి వద్ద ఉన్నాయి. మొత్తం అమెరికన్ ఆర్థిక వ్యవస్థ పెట్రోడాలర్ పై నిర్మించారని గుర్తించాలి. చమురు వ్యాపారం డాలర్లతో జరగకపోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ కూలిపోతుంది. అందుకనే, 1974లో, హెన్రీ కిస్సింజర్ సౌదీ అరేబియాతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా అమ్మడైన అన్ని చమురు ధరలను అమెరికా డాలర్లలో నిర్ణయించే విధంగా అవగాహనకు వచ్చారు. అందుకు బదులుగా, అమెరికా ఆ దేశానికి సైనిక రక్షణను అందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా డాలర్లకు కృత్రిమ డిమాండ్‌ను సృష్టించింది. భూమిపై ఉన్న ప్రతి దేశానికి చమురు కొనడానికి డాలర్లు అవసరం. ఇది అమెరికా అపరిమిత డబ్బును ముద్రించడానికి అనుమతిస్తుంది. ఆ నిధులతోనే సైన్యానికి నిధులు సమకూరుస్తుంది. సంక్షేమ రాజ్యం. లోటు వ్యయం. పెట్రోడాలర్ సైనిక విమానాలకంటే అమెరికా ఆధిపత్యానికి చాలా ముఖ్యంగా మారింది. అందుకనే దానిని సవాలు చేసే నేతలను అమెరికా సహింపలేదు. 2000లో సద్దాం హుస్సేన్ ఇరాక్ డాలర్లకు బదులుగా యూరోలలో చమురును విక్రయిస్తుందని ప్రకటించాడు. 2003 నాటికి అమెరికా ఆ దేశాన్ని ఆక్రమించుకుంది.ఇరాక్ చమురు వెంటనే డాలర్లకు తిరిగి మారింది. సద్దాంను కొట్టి చంపారు. 2009లో చమురు వ్యాపారం కోసం గడాఫీ గోల్ దినార్ అని పిలువబడే బంగారు మద్దతుగల ఆఫ్రికన్ కరెన్సీని ప్రతిపాదించాడు. హిల్లరీ క్లింటన్ స్వయంగా లీక్ అయిన ఇ మెయిల్‌లు జోక్యానికి ఇది ప్రధాన కారణమని నిర్ధారిస్తాయి. ఇ మెయిల్‌లో ఈ బంగారం లిబియా బంగారు దినార్ ఆధారంగా పాన్ -ఆఫ్రికన్ కరెన్సీని స్థాపించడానికి ఉద్దేశించబడింది. 2011లో నాటో లిబియాపై బాంబులు వేసింది. గడాఫీని లైంగికంగా హింసించి హత్యచేశారు. లిబియాలో ఇప్పుడు బానిసమార్కెట్లు తెరిచిఉన్నాయి.మేము వచ్చాము, మేము చూశాము, అతను చనిపోయాడు! క్లింటన్ కెమెరా ముందు నవ్వాడు. బంగారు దినార్ అతనితోపాటు మరణించింది. ఇప్పుడు మదురో. సద్దాం, గడాఫీలు ఇద్దరి వద్ద కంటే ఐదురెట్లు ఎక్కువ చమురుతో యువాన్‌లో చురుకుగా అమ్ముతున్నారు. డాలర్ నియంత్రణ వెలుపల చెల్లింపు వ్యవస్థలను నిర్మించడంతోపాటు బ్రిక్స్‌లో చేరాలని దరఖాస్తు చేసుకున్నాడు. డాలర్ ఆధిపత్యాన్ని కట్టడి చేసేందుకు నాయకత్వం వహిస్తున్న చైనా, రష్యా, ఇరాన్‌లతో భాగస్వామ్యం ఏర్పరచుకున్నాడు. ఇది యాదృచ్ఛికం కాదు. పెట్రోడాలర్‌ను ఎవ్వరు సవాల్ చేసినా వారు సమాధి కావాల్సిందే. రెండు వారాల క్రితం బిగ్గరగా ఇలా అన్నారు: అమెరికన్ చెమట, చాతుర్యం, శ్రమ వెనిజులాలో చమురు పరిశ్రమను సృష్టించాయి. దాని నిరంకుశ దోపిడీ అమెరికన్ సంపద, ఆస్తిపై నమోదైన అతిపెద్ద దొంగతనం. వెనిజులా చమురు అమెరికాకు చెందిందని నిస్సిగ్గుగా బహిరంగంగా చెబుతున్నారు. ఎందుకంటే అమెరికా కంపెనీలు దీనిని 100 సంవత్సరాల క్రితం అభివృద్ధి చేశాయి. ఈ తర్కం ప్రకారం, చరిత్రలో ప్రతి జాతీయం చేసిన వనరు దొంగతనం. కానీ ఇక్కడ లోతైన సమస్య ఉంది. పెట్రోడాలర్ ఇప్పటికే చనిపోతోంది. రష్యాఉక్రెయిన్ నుండి రూబిళు , యువాన్లలో చమురును విక్రయిస్తుంది. సౌదీ అరేబియా బహిరంగంగా యువాన్ సెటిల్మెంట్ల గురించి చర్చిస్తుంది. ఇరాన్ సంవత్సరాలుగా నాన్-డాలర్ కరెన్సీలలో వ్యాపారం చేస్తోంది. చైనా 185 దేశాలలో 4,800 బ్యాంకులతో స్విఫ్ట్‌కు తమ స్వంత ప్రత్యామ్నాయమైన సిప్స్‌ని నిర్మించింది. బ్రిక్స్ డాలర్‌ను పూర్తిగా దాటవేసే చెల్లింపు వ్యవస్థలను చురుకుగా నిర్మిస్తోంది. ఎంబ్రిడ్జ్ ప్రాజెక్ట్ కేంద్ర బ్యాంకులు స్థానిక కరెన్సీలలో తక్షణమే లావాదేవీలను పరిష్కరించడానికి అనుమతిస్తుంది. 303 బిలియన్ బ్యారెళ్ల చమురుతో వెనిజులా బ్రిక్స్‌లో చేరడం వల్ల ఇది విపరీతంగా వేగవంతం అవుతుంది ప్రస్తుతం అమెరికా సైనిక దాడి కేవలం డాలర్ అస్తిత్వానికి ఎదురవుతున్న ఈ ప్రమాదం కారణంగానే జరిగిందని స్ఫష్టం అవుతుంది. మాదకద్రవ్యాలను ఆపకపోవడం అన్నది కేవలం ఓ సాకు మాత్రమే. వెనెజువెలా అమెరికా కొకైన్‌లో 1 శాతం కంటే తక్కువ వాటా కలిగి ఉంది. పైగా, మదురో ఉగ్రవాద సంస్థను నడుపుతున్నాడని ఎటువంటి ఆధారాలు లేవు. ఎన్నికలు లేని సౌదీ అరేబియాకు మద్దతు ఇస్తున్న అమెరికా ప్రజాస్వామికంగా ఎన్నికైన మదురోను కూల్చడం వెనుక ఆర్థిక ప్రయోజనాలే బలీయంగా ఉన్నాయని స్పష్టం అవుతుంది. అయితే చరిత్ర గతి ఎప్పుడూ ఒకే విధంగా ఉండబోదని అమెరికా గ్రహించాలి. అంతర్జాతీయంగా నానాటికీ అమెరికా ఒంటరి అవుతూ ఉండగా, సరికొత్త సమీకరణాలు ఏర్పడుతున్నాయి. ఐరోపా యూనియన్ సైతం అమెరికా ఉనికి చూసి నేడు అప్రమత్తం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. బ్రిక్స్ సమీకరణాలు ఒకవైపు, చైనా,- రష్యా మరోవైపు బలమైన ప్రతిఘటన ఇచ్చేందుకు సిద్ధపడుతోంది

# పంతం నెగ్గించుకున్న కవిత

హైదరాబాద్, జనవరి 7, నిజామాబాద్ స్థానిక సంస్థల శాసనమండలి సభ్యత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజీనామా చేసిన విషయం తెలిసిందే. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేసి నాలుగు నెలలు గడిచింది. ఎట్టకేలకు ఆమె రాజీనామాను ఆమోదించారు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి. అసెంబ్లీ సమావేశాలు నిరవదిక వాయిదా పడిన కొద్ది కాసేపట్లోనే కవిత రాజీనామాకు ఆమోదం తెలుపుతున్నట్లు నోటిఫికేషన్ జారీ చేశారు లెజిస్లేటివ్ సెక్రటరీ. 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి శాసనమండలి సభ్యురాలిగా కల్వకుంట్ల కవిత ఎన్నికయ్యారు. బీఆర్ ఎస్ పార్టీతో అంతర్గత విభేదాల కారణంగా గత ఏడాది సెప్టెంబర్ 3వ తేదీన ఆ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. గడచిన సోమవారం శాసనమండలికి చివరిసారిగా హాజరై, తన రాజీనామాను ఆమోదించాలంటూ శాసన మండలి చైర్మన్ ను విజ్ఞప్తి చేశారు.చివరిసారి తాజాగా తెలంగాణ శాసన మండలిలో భావోద్వేగంగా ప్రసంగించిన కల్వకుంట్ల కవిత , తన రాజీనామా విషయంపై స్వయంగా చైర్మన్ కోరినా వినలేదు. తొందరపడకండి, ఆవేశంలో నిర్ణయాలు తీసుకోవడం సరికాదు, మీరు బాధలో ఉన్నారు. మరోసారి రాజీనామాపై పునరాలోచించండి అంటూ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కవితకు చివరిసారి నచ్చుజెప్పే ప్రయత్నం చేసినా ఆమె వినలేదు. తాను రాజకీయాల్లోకి అమెరికా నుంచి ఎందుకు వచ్చాను, తెలంగాణ ఉద్యమ సమయంలో జాగృతి ఏర్పాటు చేయడంతోపాటు, ఉద్యమానికి , బీఆర్ ఎస్ పార్టీకి జాగృతి చేసిన కృషి గురించి మండలిలో చివరి ప్రసంగంలో మాట్లాడారు కవిత. తన తండ్రి స్థాపించిన బీఆర్ ఎస్ పార్టీలో తాను మొదటి నుంచి ఎదుర్కొంటున్న అవమానాలను ప్రస్తావిస్తూనే, బీఆర్ ఎస్ ప్రభుత్వంలో భారీ అవినీతి జరిగిందంటూ మండలిలో సంచలన ఆరోపణలు చేశారు. కుటుంబ సభ్యుల నుంచి మద్దతు లేకుండా ఇన్నాళ్లు తాను ఎదుర్కొన్న సవాళ్లను సభలో ప్రస్తావిస్తూ ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు కవిత. ఉబికి వస్తున్న కన్నీళ్లతో తన ప్రసంగం ఆద్యంతం కొనసాగింది. ఇంతలా అవమానాలు ఎదుర్కొన్న తాను ఇక బీఆర్ఎస్ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో కొనసాగలేనని, తన రాజీనామా వెంటనే ఆమోదించాలని మండలి చైర్మన్‌ను కోరారు కవిత. కవిత మాటకు స్పందించిన చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారించే ప్రయత్నం చేసినా కవిత వినలేదు. ఇప్పటికే నాలుగు నెలలు రాజీనామా ఆమోదం కోసం ఎదురు చూశానని, అన్ని విషయాలు ఆలోచించిన తరువాతే ఈ నిర్ణయం తీసుకున్నానని, వెనక్కు తగ్గబోనని స్పష్టం చేశారు. కవిత రాజీనామా విషయంలో నిర్ణయం మార్చుకోవడం కష్టమని భావించిన శాసన మండలి చైర్మన్ తాజాగా ఆమె రాజీనామాకు తెలుపుతూ నోటిఫికేషన్ విడుదల చేయడంతో కవిత పంతం నెగ్గించుకున్నట్లైంది.

మరో ఉపఎన్నిక...

ఉత్కంఠకు తెరపడింది. జాగృతి అధ్యక్షురాలు కవిత రాజీనామాకు ఆమోద ముద్ర పడింది. కవిత రాజీనామాను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదించారు. గతేడాది సెప్టెంబర్ 2న బీఆర్ఎస్ పార్టీ కవితను సస్పెండ్ చేసింది. ఆ వెంటనే 3వ తేదీన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కవిత ప్రకటించారు. 2022 జనవరిలో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో బీఆర్ఎస్ కు ఫుల్ మెజార్టీ ఉంది. నాడు కాంగ్రెస్ పోటీ చేయలేదు, బీజేపీ కూడా అభ్యర్థిని నిలపలేకపోయింది. ఆ పరిస్థితుల్లో కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2028 వరకు కవిత పదవీ కాలం ఉంది. అయితే రెండున్నర సంవత్సరాల పదవీ కాలం ఉండగానే ఆమె రిజైన్ చేసేశారు.ఇప్పుడు కవిత రాజీనామాకు ఆమోద ముద్ర పడటంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. తెలంగాణలో మరో ఉప ఎన్నిక అనివార్యం అయ్యింది. కవిత రాజీనామాకు ఆమోదం లభించడంతో కౌన్సిల్‌లో ఓ స్థానం ఖాళీ అయినట్టు ఎన్నికల కమిషన్‌కు చైర్మన్ కార్యాలయం నుంచి సమాచారం వెళ్లింది. దీంతో ఆ స్థానం భర్తీ కోసం కొన్ని రోజుల్లోనే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందికవిత రిజైన్ తో ఉపఎన్నిక అనివార్యమే అయినా స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాకే బైపోల్ జరిగే అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు ఓటు వేయాలంటే మొదట స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఎంపిక కావాల్సి ఉంటుంది.ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇటీవల పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది రాష్ట్ర ప్రభుత్వం. త్వరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల కోసం సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ లెక్కన నిజామాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఓటర్లు లేరు. దీనివల్ల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఇప్పుడే నిర్వహించడం సాధ్యం కాదు. మున్సిపల్ కార్పొరేటర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటు వేయాల్సి ఉంటుంది కాబట్టి.. పరిషత్ ఎన్నికలు ముగిశాకే? పాలక మండళ్లు కొలువుదీరిన తర్వాతే ఎమ్మెల్సీ ఉపఎన్నిక జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కనీసం మూడు, నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం.బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న కవిత.. తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఎన్నికల్లో ఆమె పోటీ చేయకపోవచ్చనే విశ్లేషణ వినిపిస్తోంది.డిసెంబర్ నెలలో పంచాయతీ ఎన్నికలు ముగియడంతో రాష్ట్రంలో మిగతా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. తొలుత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రెడీ అవుతోంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెలలోనే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికలు ముగియగానే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

## ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ నూతన సర్పంచులు

## ఉప సర్పంచుల అభినందన సభలో పాల్గొని ప్రసంగించి ,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ఖమ్మం ప్రతినిధి జనవరి 7 (ప్రజాబలం)** ఖమ్మం లో నిర్వహించిన సర్పంచ్ ఉప సర్పంచ్ అభినందన సభలో ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎండగట్టారుబీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యూరియా కష్టాలు లేవు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లైన్‌లలో చెప్పులు కనిపిస్తున్నాయి. షాపుల్లో లేని యూరియా యాప్‌లలో ఎలా వస్తుంది?కాంగ్రెస్ పాలనలో ఎగవేతలు, కూల్చివేతలు. కౌలు రైతులకు ఇస్తామన్న డబ్బులు ఇచ్చారా? ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చారా? రెండేళ్లలో ఏం అభివృద్ధి జరిగింది? కూల్చివేతలు, ఎగవేతలే కనిపిస్తున్నాయి.






ఇది సర్వభ్రష్ట ప్రభుత్వం ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని కేసీఆర్ పని చేశారు. ఇప్పుడు ఇదే జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నారు. కనీసం రైతులకు యూరియా ఇప్పించలేని పరిస్థితిలో ఉన్నారు. కమీషన్ల కోసమే ఆ ముగ్గురు పని చేసేది. 30 శాతం ట్యాక్స్ నడిపిస్తున్నారు వాళ్లు. ఆరు గ్యారెంటీలు భద్రంగా పెట్టుకోండని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆనాడు ఎన్నికల ప్రచారంలో చెప్పారు. ఇప్పుడు రెండేళ్లు అయినా గ్యారెంటీలు అమలు కాలేదు. దీనికి భట్టి ఏమి సమాధానం చెబుతారు? అని కేటీఆర్ గారు అన్నారు.ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్ రెడ్డి, హరిప్రియ నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు దిండిగల రాజేందర్, ఖమర్, మాజీ ఎమ్మెల్యేలు చంద్రావతి, తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి పై కేటిఆర్ చేసిన వ్యాఖ్యల పై

## ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఫైర్



రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి పై కేటిఆర్ చేసిన వ్యాఖ్యల పై ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఫైర్ జనగామలో కేటీఆర్ మితిమీరి, మతితప్పి బలుపు ఎక్కి మాట్లాడుతుండువిచక్షణ కోల్పోయి రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి పై మాట్లాడుతుండుఇంకొక సారి విచక్షణ కోల్పోయి కేటిఆర్ మాట్లాడితే తోడకలు తీస్తాంజూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓడిపోయి కేటిఆర్ పరువు పోయిందిసర్పంచ్ ఎన్నికల్లో అడ్రస్ గల్లంతు అయిందిఅయినా కేటీఆర్ కు ఇంకా బుద్ధి రాలేదుహౌలా మాటలు మాట్లాడుతుండుశాసనసభ కాదు బూతుల సభ అని కేటిఆర్ అంటుండు అంటుండువ్యక్తి మీద ఉన్న అసూయ,ద్వేశంతో శాసన సభ వ్యవస్థను అగౌర పరుస్తుండుస్పీకర్ కేటిఆర్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న

## వృద్ధులకు పండ్లు దుప్పట్లు పంపిణీ చేసిన గ్రానైట్ ట్రేడర్స్ మార్కర్ అసోసియేషన్ సభ్యులు



**ఖమ్మం ప్రతినిధి జనవరి 7 (ప్రజాబలం)** ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్ అసోసియేషన్ వారి సంఘం తరపున ఖమ్మం శ్రీనివాస్ నగర్ నందు ఉన్న నేను ఉన్నాను అనాథ శరణాలయం లో ఉన్న వృద్ధులుకు పండ్లు మరియు దుప్పట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు అదాలత్ నరేంద్ వెంపటి వెంకటేశ్వర్లు సూచన మేరకు సంఘం గౌరవ అధ్యక్షుడు ఉపేందర్ అధ్యక్షుడు నూనావత్ కిషన్ ఆధ్వర్యంలో సెక్రటరీ షేక్ జానీఉపాధ్యక్షుడు పాషా మరియు భద్రం రామ్మూర్తి కోశాధికారి సైదులు జాయింట్ సెక్రెటరీ నరసింహారావు వడ్ల కొండ శ్రీను గట్ల అంజయ్య సంఘం సభ్యులు ఈ కార్యక్రమంలో సహాయ సహకారాలు అందించిన వారికి సంఘం తరుపున ధన్యవాదాలు తెలియజేశారు

## మృతుని కుటుంబానికి ఎస్ కే ఆర్ ట్రస్ట్ ద్వారాఆర్థిక సహాయం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 07 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి, మండల పరిధిలోగల బుచన్ పల్లి, గ్రామం సోమవారం నర్సింలు, తల్లి,రసామ్మ మరణించిన, విషయం తెలుసుకొని, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఎస్, కె,అర్, ట్రస్టు ,అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మరియు జిల్లా ఉప అధ్యక్షుడు యూ, రవీందర్, మరియు గ్రామ సర్పంచ్ వెంకట్రామ్ రెడ్డి , ఉప సర్పంచ్ సేకులోదిన్, కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంటు జే, మహేందర్, ఆర్థిక సాయం 5,000,వేల రూపాయలు అందించారు పార్టీ సీనియరు నాయకులు కే శ్రీనివాసు రెడ్డి ,బాల్ వంతురెడ్డి ,ఏ. కిష్టయ్య. బి సంగమేశు ,బి జేగను, మోహన్రెడ్డి, బి బక్కారెడ్డి ,ఈ బల్లప్ప ,బి గోవర్ధన్ రెడ్డి, మరియు లోక శ్రీను, బి,రంగయ్యా ,బి రవి , పి,శ్రీను ,టి రాజు, ఎన్ ,రాములు, మరియు పార్టీ కార్య కర్తలు అందరూ కలిసి అందించారు

## బిఆర్ఎస్ పార్టీ 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బరిలో

## బిఆర్ఎస్ నాయకుడు తుడుం రాజు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 07 ప్రజాబలం సంగారెడ్డి జిల్లా :**అందోల్ జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో, 5,వ వార్డ్ నుండి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తుడుం రాజు, బరిలో ఉంటానని, ఆశీర్వదిస్తే అభివృద్ధికై ప్రజల కష్టాలు తీరుస్తానని,ఆయన అన్నారు ఇప్పటివరకు ఒకే పార్టీ ఒకే జెండా ప్రస్తుతం అందోల్ జోగిపేట్ మున్సిపల్ 5,వ వార్డు కౌన్సిలర్ బరిలో ఉన్నానని ఆయన అన్నారు .మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, ఆశీస్సులు తనకే ఉన్నాయంటూ, 5,వ వార్డ్ కౌన్సిలర్ బరిలో నేను ఉంటానని తుడుం రాజు, ఆవేదన వ్యక్తం చేశారు.....

## రాష్ట్రంలో రాజకీయ శూన్యత లేదు, కాబట్టి కొత్త పార్టీలకు మనుగడ కష్టమే.."

హైదరాబాద్ జనవరి 7 ;రాష్ట్రంలో రాజకీయ శూన్యత లేదు, కాబట్టి కొత్త పార్టీలకు మనుగడ కష్టమే.." అని రాష్ట్ర శాసనమండలి (కౌన్సిల్) చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె. కవిత స్వయంగా వచ్చి తన ఎమ్మెల్యే పదవికి చేసిన రాజీనామాను ఆమోదించాల్సిందిగా కోరడంతో ఆమోదించానని ఆయన బుధవారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అన్నారు. అంతకు ముందు ఆమె స్వయంగా రాజీనామా లేఖ అందించకుండా వ్యక్తిగత కార్యదర్శి (పిఏ) ద్వారా పంపించినందున ఆమోదించలేదని ఆయన చెప్పారు. భావోద్వేగంతో తీసుకున్న నిర్ణయం అని భావించి కొంత సమయం ఇవ్వడం సర్వసాధారణంగా చేస్తుంటామని ఆయన తెలిపారు. చట్ట సభల్లో ఎక్కడైనా సభ్యుడు రాజీనామా చేసినప్పుడు ప్రసంగించేందుకు అనుమతించాలని కోరితే ఇవ్వడం సంప్రదాయంగా ఉందన్నారు. కవిత కోరిక మేరకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చానని ఆయన తెలిపారు. కవిత పార్టీ పెట్టబోతున్నట్లు జరుగుతున్న ప్రచారం గురించి ప్రశ్నించగా, రాష్ట్రంలో రాజకీయ శూన్యత లేదు కాబట్టి కొత్త పార్టీలకు మనుగడ కష్టమేనని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్నో పార్టీలు వచ్చాయి, ఆ వెంటనే కొంత కాలానికి అవి కనుమరుగయ్యాయని అన్నారు.


రానున్న మున్సిపల్ ఎన్నికల గురించి ప్రశ్నించగా, సాధారణంగా అధికార పార్టీకే ఎక్కువగా గెలుపొందే అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. కౌన్సిల్‌లో కవిత కుటుంబ సభ్యుల గురించి చేసిన వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా, తాను స్పందించడం బాగుండదని, అవి ఆమె వ్యక్తిగతమైన వ్యాఖ్యలని అన్నారు.

## వేములవాడ గుడి చెరువులో బోటింగ్ ఏర్పాటు కోసం నిధులు మంజూరు.

**ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషి**

**.1 కోటి 40 లక్షల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.**

**అసెంబ్లీలో మాట్లాడిన రెండు రోజుల్లోనే నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు, రాజన్న భక్తులు.**





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఒక కోటి 40 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రోజున ఉత్తర్వులు తయారు చేసింది. వేములవాడకు వచ్చే భక్తులు, పర్యాటకులకు మరి ఆహ్లాదకరమైన అనుభూతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గత కొంతకాలంగా ప్రభుత్వాన్ని పలుమార్లు బోటింగ్ సౌకర్యం గురించి కోరడం జరిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో కూడా ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ గుడి చెరువులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కూడా కుడి చెరువులో బోటింగ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపగా, రెండు రోజుల క్రితం అసెంబ్లీలో కూడా ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ గుడిచెరువులో బోటింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు త్వరలోనే బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీకి అనుగుణంగానే మంగళవారం జీవో నెంబర్, తేదీ: 07/01/2026 గుడి చెరువులో పోటీకి సౌకర్యం ఏర్పాటు కోసం 1.40 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యదర్శి జయస్ రంజన్ అధికారిక ఉత్తర్వులు విడుదల చేశారు. వేములవాడ పట్టణ ప్రజలు, ఆలయానికి వచ్చే భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోటింగ్ ఏర్పాటు ద్వారా పర్యాటక ఆకర్షణ పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని వారు అభిప్రాయపడుతున్నారు. వేములవాడ పట్టణంలో ఒకవైపు 150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ, 47 కోట్లతో రోడ్ల వెడల్పు పనులు శరీ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో నేడు బోటింగ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ఒక కోటి 40 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడంతో వేములవాడ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కాగా అసెంబ్లీలో రాజన్న ఆలయ గుడి చెరువుల బోటింగ్ ఏర్పాటు చేయాలని కోరిన రెండు రోజుల్లోనే ఒకకోటి 40 లక్షల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు లకు ప్రభుత్వ విపాది శ్రీనివాస్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వేములవాడ అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని విప్ పేర్కొన్నారు.

## పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి: ముఖ్యమంత్రి చంద్రబాబు




అమరావతి జనవరి 7 : పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిలాంటిదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి వెల్లడించారు. బుధవారం ఆయన ఏలూరు జిల్లా పోలవరంలో మంత్రులతో కలసి పోలవరం ప్రాజెక్టు ను సందర్శించారు. కాఫర్ డ్యామ్, బట్రస్ డ్యామ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన పోలవరంలో మీడియా సమావేశంలో మాట్లాడారు.వైసీపీ రాష్ట్రంలోని రాయలసీమ నీటి ప్రాజెక్టులపై చిల్లర రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. రాయలసీమకు ఎత్తిపోతల ద్వారా నీటి వాడకాన్ని నిలిపివేసినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తుందని దుయ్యబట్టారు. తనపై బురద చల్లడం వల్ల ఆరోపణలు నిజం కాబోవని స్పష్టం చేశారు. కన్‌స్ట్రక్టీవ్ రాజకీయాలు చేయాలని సూచించారు.పోలవరం గ్యాప్ -1లో పనులన్నీ ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్యాప్-2లో అప్‌స్ట్రీమ్ , డౌన్ స్ట్రీమ్ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. రైట్ కనెక్టివిటీలో 19 మీటర్ల వెడల్పు, ఎత్తుతో రెండు టన్నెళ్లు వస్తాయని పేర్కొన్నారు. విశాఖకు నీరు తీసుకెళ్లే కాలువను బాగా వెడల్పు చేశామని, దీంతో అనకాపల్లి, విశాఖ జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని వెల్లడించారు.పట్టిసీమ ఎత్తిపోతలను ఏడాది వ్యవధిలో పూర్తి చేశామని వివరించారు. ఈ సంవత్సరం 97 శాతం అన్ని జల నీటివనరుల్లోకి నీరు వచ్చి చేరిందని , ప్రస్తుతం అన్ని జలాశయాల్లో 780 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇది ఎంతో గర్వకారణమని అన్నారు. శ్రీశైలంలో నీళ్లు పొదుపు చేసి రాయలసీమకు నీరివ్వగలిగామని వెల్లడించారు. రాయలసీమలో గొల్లపల్లి కట్టి కియా మోటార్స్ తీసుకొచ్చానని వివరించారు.

## భవిష్యత్తులో నేను, నా కుటుంబసభ్యులు ఎన్నికల్లో పోటీ చేయబోము స్పష్టం చేసిన కైకలూరు బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



కైకలూరు జనవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కైకలూరు బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల నుంచి ఎప్పుడో విరమించుకోవాలనుకున్నా అని తెలిపారు. కానీ అందరూ కోరుకోవడంతో 2024లో పోటీచేశానని వెల్లడించారు. ఎన్నికల్లో ఊహించని మెజారిటీ తనకు వచ్చిందని చెప్పారు.భవిష్యత్తులో నేను, నా కుటుంబసభ్యులు ఎన్నికల్లో పోటీ చేయబోమని కామినేని స్పష్టం చేశారు. ఇకపై మంచి పనులు చేసి పేరు తెచ్చుకుంటానని చెప్పారు. నియోజకవర్గంలో అన్యాయం, అక్రమాలు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## ఆలయ చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్ సర్దార్ పటేల్ నగర్ లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన దొంగతనం కేసులో దర్యాప్తు ప్రారంభించామని కూకట్ పల్లి ఏసిపి రవికిరణ్ రెడ్డి వెల్లడించారు. కేపి.హెచ్.బి సీఐ రాజశేఖర్ రెడ్డి, డి ఐ రవితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు యాక్టివ్ ద్వారా వచ్చి గుడి లోనికి ప్రవేశించి మూలవిరాట్ కు సంబంధించిన వెండి బంగారు ఆభరణాలు దొంగలించారని వెల్లడించారు. ఇప్పటికే ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నామని అన్నారు. అలాగే నిర్వాహకుల ప్రకారం సుమారు 40 లక్షల రూపాయల విలువచేసే వస్తువులు దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు చేశారని వాటిపైన దర్యాప్తు కొనసాగించామన్నారు.

## వృద్ధురాలిపై దాడి ,పది తులాల బంగారం దోపిడి

హైదరాబాద్ సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్మాన్ఘాట్ లో ఒంటరిగా నివసిస్తున్న సుగుణ అనే 68 ఏళ్ల వృద్ధురాలిపై స్ప్రే తో దాడి చేసి సుమారు 10 తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన సంఘటనర్ పోలీస్ స్టేషన్లో జరిగింది. వృద్ధురాలికి పరిచయస్తు రాలైన సుమిత్ర అనే మహిళ మరో ఇద్దరితో కలిసి ఒంటరిగా ఉన్న వృద్ధురాలు ఇంటికి వెళ్లి ముఖంపై స్ప్రే తో దాడి చేసి అపస్మారక స్థితిలోకి చేరిన తర్వాత తన ఒంటిపై ఉన్న పది తులాల బంగారంతో ఉదాయించారు .వృద్ధురాలు ఫిర్యాదు మేరకు సుమిత్ర ను అదుపులోకి తీసుకున్న సరూర్నగర్ పోలీసులుచ ఇద్దరి కోసం గాలింపు చేపట్టారు...

# టీడీపీ గూటికి సిద్ధా...

ఒంగోలు, జనవరి 7, వైయస్సార్ కాంగ్రెస్(పార్టీకి గుడ్ బై చెప్పారు ఒక మాజీ మంత్రి. అయితే ఏడాది కిందట ఆయన రాజీనామా చేశారు. కానీ ఇంతవరకు ఏ పార్టీలో చేరలేదు. ఇష్టమైన పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. మరో పార్టీలో చేరే ఉద్దేశం లేదు. దీంతో గత ఏడాదికాలంగా ఆయన భగీరథ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయితే అధినేత చంద్రబాబును కలిశారు. కానీ లోకల్ నాయకత్వం నుంచి అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఇప్పుడు స్థానిక నేతలను సముదాయించారు చంద్రబాబు. దీంతో ఆ నేతకు పార్టీలో చేర్పించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఆ మాజీమంత్రి తెలుగుదేశం పార్టీలో చేరుతారని సొంత జిల్లాలో ప్రచారం జరుగుతోంది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అలానే ఆ పార్టీకి రాజీనామా చేశారు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయిన తరువాత రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరారు. అలా చేరిన క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ నాయకత్వం ఆయనకు ఒక హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే దర్శి టికెట్. గతంలో అదే నియోజకవర్గంలో నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అందుకే ఆ టికెట్ తనకు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ జగన్మోహన్ రెడ్డి అందుకు అంగీకరించలేదు. మొన్నటి ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు అయితే అయిష్టంగానే ఆ పార్టీలో కొనసాగారు రాఘవరావు. ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయిన వెంటనే రాజీనామా ప్రకటించారు. చంద్రబాబుతో ఉన్న తన పాత సాన్నిహిత్యాన్ని గుర్తు చేస్తూ పార్టీలోకి వస్తానని కోరారు. అయితే స్థానిక నాయకత్వం నుంచి అభ్యంతరాలు ఉండడంతో చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చంద్రబాబు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.ప్రకాశం జిల్లాలో సీనియర్ మోస్ట్ లీడర్ సిద్దా రాఘవరావు. 1999 నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. 2007లో చంద్రబాబు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. 2014లో దర్శి టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచేసరికి తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు రాఘవరావును. ఐదేళ్లపాటు మంత్రి పదవిలో కొనసాగిన ఆయనను 2019 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఓటమి ఎదురయ్యేసరికి రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ ఒత్తిడికి వెనక్కి తగ్గారు. దర్శి టిక్కెట్ హామీతో ఆ పార్టీలో చేరారు. కానీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు. పార్టీ ఓడిపోయేసరికి రాఘవరావుకు స్వేచ్ఛ లభించింది. అందుకే ఇప్పుడు మాతృ పార్టీలో చేరేందుకు చేసిన ప్రయత్నం కూడా ఫలించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన తెలుగుదేశం పార్టీలోకి రావడం ఖాయమని తెలుస్తోంది. కానీ దర్శికి ఇప్పటికే టిడిపి ఇన్చార్జిగా ఉన్నారు గొట్టిపాటి లక్ష్మి. మొన్నటి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఇప్పుడు రాఘవరావు వస్తుండడంతో లక్ష్మి పరిస్థితి ఏంటి అనేది తెలియడం లేదు. చంద్రబాబు ఇద్దరికీ న్యాయం చేస్తారని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# వైసీపీలో అమలాపురం ఫైట్

కాకినాడ, జనవరి 7, సాధారణంగా ఎన్నికలు దగ్గరపడుతుండడంతో సీట్లు దక్కించుకునేందుకు నేతలు పోటీ పడుతుంటారు.. దానికోసం ప్రచార అస్త్రాలతోపాటు ప్రజలతో మమేకమవ్వడం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం.. అధినేతలను, ముఖ్యనేతలను కలుసుకుని తన గుర్తింపును పదిలపరచుకోవడం వంటివి చూస్తుంటాం.. కానీ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రతిపక్షపార్టీ వైఎస్సార్ సీపీ లో పరిస్థితి దీనికి భిన్నంగా మారింది.. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల కాలం ఉన్నా వైసీపీ నాయకులు వైసీపీ అసెంబ్లీ సీటు కోసం నానా హైరానా పడుతున్నారు.. బరిలో మేమున్నామంటే మేమున్నామంటూ నియోజకవర్గ సమన్వయకర్తతో సంబంధం లేకుండా ఎవరికివారు తమ ఉనికిని చాటుకునేందుకు కాపాడుకునేందుకు వీర ప్రయత్నాలు చేస్తున్నారు.. 2012 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘోర పరాజయం తరువాత చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు.. ఇదే తీరు అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజకవర్గంలోకూడా కనిపించింది.. అయితే వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మార్పు తరువాత అనూహ్యమైన మార్పు కనిపిస్తోంది.. అమలాపురం నియోజకవర్గంలో తిరుగులేని పాత్ర పోషించిన మాజీ మంత్రి విశ్వరూప్ నియోజకవర్గానికి దూరమవ్వడం.. ఆయన కుమారుడు శ్రీకాంత్ నాయకత్వాన్ని అంగీకరించని కొందరు పార్టీ నేతలు పక్కచూపులు చూడడం.. మొత్తం మీద నియోజకవర్గంలో వైసీపీ ఐక్యతా రాగం బీటలువారి రిజర్వుడు కేటగిరిలో ఉన్న కొందరు నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.. ఇటీవల ఉప్పలగుప్తంలో జరిగిన జగన్ జన్మదిన వేడుకలో ప్రోటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ అసహనం వ్యక్తం చేస్తూ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయముందని, అధిష్టానం ఎవరికి సీటు ఇచ్చినా వారి గెలుపుకోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.. అంటే అమలాపురం వైసీపీలో సీటు కోసం హీటు పెరిగిందా అన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.. అమలాపురం పార్లమెంటు స్థానం నుంచి తొలిసారిగా ఎంపీగా పోటీచేసి విజయం సాధించిన మాజీ ఎంపీ చింతా అనురాధ ఇటీవల కాలంలో తన స్పీడు పెంచారు.. మొన్నటి ఎన్నికల్లో సీటు దక్కకపోవడంతో నియోజకవర్గానికి చాలా కాలం దూరమయ్యారు.. అయితే ఎన్నికల సమయంలో మాత్రం అడపా దడపా ప్రచారంలో పాల్గొన్న అనురాధ మొత్తం మీద సీఈసీ సభ్యురాలిగా పదవిని తెచ్చుకోగలిగారు. దీంతో అప్పటి నుంచి స్పీడు పెంచిన అనురాధ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.. ఓ పక్క పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ప్రత్యేకంగా తన వర్గంతో పరామర్శల నుంచి పలుకరింపుల వరకు ఒక్క రోజులో అనేక చోట్ల చుట్టేస్తున్నారు.. అంతటితో ఆగక సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎంపీ అనురాధ వెంట నడుస్తున్నవారిలో ఎక్కువ మంది గతంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గమే ఉండడం కనిపిస్తోంది.. ఉప్పలగుప్తంలో జరిగిన జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలో మాజీ మంత్రి విశ్వరూప్, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు ఫోటోలు లేకుండానే ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం అక్కడి వారు చింతా అనురాధా నాయకత్వాన్ని బలపరుస్తున్నట్టు చెప్పకనే చెప్పినట్లయ్యింది.. గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహించే వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని తరచూ కలవడం, ఇటీవల జరిగిన జగన్ జన్మదిన వేడుక సందర్భంగా భారీ స్థాయిలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ఎప్పటిలానే కనిపించినా ఈ ఏడాది అయితే మరింత జోరు పెంచినట్లు కనిపిస్తోంది.. అయితే గత కొన్ని నెలలుగా ఒకప్పుడు మాజీ మంత్రి విశ్వరూప్ అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారిలో కొంత మంది రమణారావు వెంట కనిపిస్తున్నారు.. జగన్ అజెండాతో కొంత మంది పార్టీ యువత చేస్తున్న కార్యక్రమాలను ప్రోత్సహించడం, నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేయడంతోపాటు ఆ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తన ఉనికిని చాటుకునేందుకు మరింత స్పీడు పెంచినట్లు కనిపిస్తోంది.. ఇదిలా ఉంటే మాజీ ఎంపీ అనురాధ, రమణారావు పలు కార్యక్రమాలకు కలిసి పాల్గొనడం ఆ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ కానీ, ఇతర ముఖ్యనేతలు కనిపించకపోవడంపై చర్చ సాగుతోంది..నియోజకవర్గంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గంలో చాలా మంది పక్కచూపులు చూడడం ఇంతకాలం అసంతృప్తితోనే ఆయన వెంట నడిచారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. ఓటమి తరువాత అందులోనూ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాధ్యతల మార్పు తరువాత వర్గీయులకు వంక దొరికిందా అన్న చర్చ జరుగుతోంది.. ఇటీవల ప్రకటించిన పార్టీ పదవుల్లో ఆశపడి భంగపడ్డ వారు, అధికారంలో ఉన్నప్పుడు తమకేమీ ఉపయోగపడలేదన్న అసంతృప్తితోనే దూరమవుతున్నట్లు కొందరు చెబుతున్నట్లు తెలుస్తోంది.. అయితే ముఖ్య అనుచరగణంలో కొందరు మాత్రం విశ్వరూప్ వెంటే ఉండగా విశ్వరూప్ స్థానికంగా పెద్దగా ఉండకపోవడంతో వారు ఇటీవలకాలంలో సైలెంట్ అవుతున్నారు.. ఇక తప్పక నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ పిలుస్తున్నప్పుడు వెళ్లి హాజరవుతున్నట్లు తెలుస్తోంది.. రాబోయే ఎన్నికల పండుగ కోసం ఎదురు చూస్తున్న కొందరు వైసీపీ నాయకులు ముందే కూసిన కోయిల చందంగా ప్రచారార్భాటాలతో దూసుకుపోతుండగా మీరు కోనసీమకు మళ్లీ రావాలంటూ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుకు కొందరు వైసీపీ నాయకులు స్వాగతం పలుకుతున్నారని తెలుస్తోంది.. సోషల్ మీడియా వేదికగా కూటమి నేతలపై విరుచుకుపడుతున్న బొజ్జా ఐశ్వర్యకు వైసీపీ బెర్త్ ఖాయం అంటూ మరికొందరు జోష్యం చెప్పడం నియోజకవర్గంలో కనిపిస్తోంది.. ఎన్నికలకు చాలా సమయం ఉన్నా మొత్తం మీద అమలాపురం వైసీపీలో మాత్రం సీట్ కోసం హీట్ కనిపిస్తోంది..

# శీతాకాల సమావేశాలెప్పుడు...

విజయవాడ, జనవరి 7, చట్టసభల్లో బలమైన వాణిని వినిపించేందుకు ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. అంటే శాసనసభ, శాసనమండలి అన్నమాట. అయితే ఏపీలో మాత్రం చట్టసభల్లో సీరియస్ నెస్ లేదు. రకరకాల కారణాలు చెప్పి సభ్యులు సభకు హాజరు కావడం లేదు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో శాసనసభకు రామని జగన్మోహన్ రెడ్డి తేల్చి చెబుతున్నారు. సాధారణంగా ప్రతిపక్షం ఉంటేనే శాసనసభకు ఒక ప్రత్యేకత వస్తుంది. అక్కడ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు ప్రజాభిప్రాయం కూడా ప్రతిపక్షం ద్వారా వ్యక్తం అవుతుంది. కానీ దురదృష్టవశాత్తు ఏపీలో ప్రతిపక్షం అంటూ లేకుండా పోయింది. కేవలం 11 అసెంబ్లీ సీట్లు రావడంతో టెక్నికల్ గా ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా రాలేదు. రాజకీయ ఉద్దేశ్యంతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని జగన్ మోహన్ రెడ్డి చెబుతున్నారు. అయితే గతంలో ఇదే టెక్నికల్ ఇష్యూపై మాట్లాడారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు ఆయనే ప్రతిపక్ష హోదా అడుగుతున్నారు దానిని అధిగమించి.అయితే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో శీతాకాల అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాయి. పొరుగున దాయాది రాష్ట్రమైన తెలంగాణలో సైతం అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్నాయి. అయితే ఏపీలో మాత్రం సమావేశాలు జరగలేదు. సాధారణంగా నవంబర్ నుంచి జనవరి వరకు ఈ శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి. కానీ ఎందుకో ఏపీలో మాత్రం ఆ పరిస్థితి లేదు. జనవరి రెండో వారంలో సమావేశాలు ఉంటాయని అప్పట్లో వార్తలు వచ్చాయి. స్పీకర్ నుంచి కానీ.. డిప్యూటీ స్పీకర్ నుంచి కానీ ఎటువంటి స్పష్టత లేదు. ఈనెల 18 వరకు ఎలాగూ సంక్రాంతి సెలవులు కొనసాగుతాయి. సమావేశాలు పెట్టడం కుదరదు కూడా. అయితే 25 లోగా సమావేశాలు నిర్వహిస్తారని? ఐదు నుంచి ఆరు రోజులు కొనసాగిస్తారని తెలుస్తోంది.గతంలో శాసనసభ అంటే ఒక గౌరవభావంతో చూసేవారు. ఏడాదికి మూడు నుంచి నాలుగు సార్లు శాసనసభ సమావేశాలు జరిగేవి. వేసవి కాల సమావేశాలు, వర్షాకాల సమావేశాలు, చివరిసారిగా శీతాకాల సమావేశాలు జరిపేవారు. అత్యవసర తీర్మానాల కోసం? అత్యవసర సమావేశాలు కూడా నిర్వహించేవారు. కానీ ఎప్పుడైతే అసెంబ్లీకి ప్రతిపక్షం బహిష్కరిస్తుందో.. ఆ సీరియస్ నెస్ తగ్గుతూ వస్తోంది. ఇప్పుడు కూడా వైసిపి బహిష్కరించడంతో శాసనసభకు పెద్దగా ప్రాధాన్యత లేకుండా పోతోంది. అందుకే సీఎం చంద్రబాబు సొంత పార్టీ ఎమ్మెల్యేలను సైతం ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు. అయితే ప్రతిపక్షం లేనిదే శాసనసభకు అంత హుందాతనం రాదు. బహుశా ఆ కారణంతోనే శాసనసభ సమావేశాల విషయంలో సరైన నిర్ణయాలు రాలేదని తెలుస్తోంది.

# రాజకీయాలకు విష్ణుకుమార్ రాజు గుడ్ బై

విశాఖపట్టణం, జనవరి 7, బిజెపిలోఆయన సీనియర్ మోస్ట్ లీడర్. మొన్నటి ఎన్నికల్లో గెలిచేసరికి మంత్రి పదవి వస్తుందని భావించారు. పాత తరం బిజెపి నాయకుడు కావడంతో ఇట్టే అవకాశం ఇస్తారని అంచనా వేశారు. ఆపై చంద్రబాబుతో ఉన్న సాన్నిహిత్యంతో తనకి పదవి తప్పదని నమ్మకం పెట్టుకున్నారు. అయితే వివిధ సమీకరణలో భాగంగా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు.

బిజెపిలో సైతం తగినంత ప్రాధాన్యం లేదు. అందుకే వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోవాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. బిజెపిలో ఇది హాట్ టాపిక్ గా మారింది. ఇంతకీ ఎవరు ఆ నేత? అంటే విష్ణుకుమార్ రాజు. విశాఖ ఉత్తర నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే2014 ఎన్నికల్లో గెలిచారు విష్ణుకుమార్ రాజు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి. అప్పట్లో కూడా టిడిపి అధికారంలోకి వచ్చింది. బిజెపి రాష్ట్ర ప్రభుత్వంలో చేరింది. అప్పుడు కూడా రెండు మంత్రి పదవులు వచ్చాయి. ఒకటి కామినేని శ్రీనివాస్ కు ఇచ్చారు. ఇంకొకటి మాణిక్యాలరావు దక్కించుకున్నారు. విష్ణుకుమార్ రాజు శాసనసభ పక్ష నేతగా ఉండేవారు. అయితే టిడిపి భాగస్వామ్య పక్షంగా బిజెపి వ్యవహరించేది. చంద్రబాబు నాయకత్వాన్ని విష్ణుకుమార్ రాజు సమర్థించేవారు. 2018లో ఎన్డీఏ నుంచి బయటకు వెళ్లిపోయింది తెలుగుదేశం. ఆ సమయంలో కూడా చంద్రబాబు పట్ల గౌరవం గానే ఉండేవారు విష్ణుకుమార్ రాజు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది బీజేపీ నేతలు చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రకటనలు చేసేవారు. ఆ సమయంలో సైతం విష్ణుకుమార్ రాజు చంద్రబాబుకు అనుకూలంగానే ప్రకటనలు చేసేవారు. 2024 ఎన్నికల్లో పొత్తు కుదరడం, టిడిపి కూటమి గెలవడంతో తనకు తప్పకుండా మంత్రి పదవి దక్కుతుందని ఆశలు పెట్టుకున్నారు విష్ణుకుమార్ రాజు. అయితే అటువంటిదేమీ లేకపోవడంతో తీవ్ర ఆవేదనతో ఉన్నారటభారతీయ జనతా పార్టీలో సైతం విష్ణుకుమార్ రాజుకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదు.

అది ఆయనకు ఇబ్బందికరంగా మారింది. ఒకానొక దశలో బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవికి విష్ణుకుమార్ రాజు పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే ఇప్పుడు పార్టీలో సైతం పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం.. విశాఖకు వస్తున్న మెరుగైన ప్రాజెక్టులన్నీ ఇతర ప్రాంతాలకు పరిమితం కావడంతో ప్రజల నుంచి ఓ రకమైన అసంతృప్తి స్వరం వినిపిస్తోంది. అనుకున్నది సాధించలేకపోతున్నానన్న ఆవేదన ఆయనలో ఉంది.

అందుకే 2029 ఎన్నికల్లో క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెప్తానని అనుచరుల వద్ద వ్యాఖ్యానిస్తున్నారు. అయితే తన కుమార్తెను రంగంలోకి దించేందుకు రాజుగారు అలా మాట్లాడుతున్నారని అనుచరులు చెబుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# కొత్త లుక్ లో జనసేనాని...

విజయవాడ, జనవరి 7, పొలిటికల్ ట్రెండ్ సెట్టర్ పవన్ కళ్యాణ్. తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక స్టార్ డం ఉన్న హీరో. విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అయితే రాజకీయాల్లోకి వచ్చిన పవన్ విజయం కోసం చాలా రోజులు వెయిట్ చేయాల్సి వచ్చింది. అయితే ఆయన హావభావాలు, వస్త్రధారణ విభిన్నంగా ఉంటుంది. ఒక్కోసారి ఒక్కో స్టైల్ లో కనిపిస్తున్నారు. అయితే సాధారణంగా రాజకీయ పార్టీల నేతలు దోతి వంటి వాటిలో ఎక్కువగా కనిపిస్తారు. ఖద్దరుదారణ కూడా చేస్తారు కానీ పవన్ కళ్యాణ్ ఇటీవల డిఫరెంట్ లుక్ లో కనిపిస్తున్నారు. క్యాజువల్ డ్రెస్సెస్ తో పాటు కార్పొరేట్ లుక్ తో కనిపిస్తున్నారు. ఇప్పుడు ఇది అందరిలోనూ ఆశ్చర్యం వేస్తోంది. సహజంగానే సినీ పరిశ్రమ నుంచి రావడంతో ఫుల్ గ్లామర్ పవన్ కళ్యాణ్ ది. అటువంటిది ఇప్పుడు రాజకీయ నాయకుడిగా కాకుండా.. ఓ కార్పొరేట్ ఉద్యోగి తరహాలో కనిపిస్తున్నారు పవన్.సినిమా రంగంలో అగ్ర కథానాయకుడిగా కొనసాగారు పవన్ కళ్యాణ్. ఆయనది చరిష్మ ఉన్న ముఖం. అయితే అంతటి స్టార్ డం ఉన్న పవన్ కళ్యాణ్ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసేసరికి ఒక సాధారణ రాజకీయ నాయకుడిగా మారిపోయారు. కుర్తాతో ఎక్కువగా కనిపించేవారు. ఆపై మెరిసిన గడ్డంతో, తల జిత్తుతో ఎక్కువగా బయటకు వచ్చేవారు. అయితే ఇటీవల మాత్రం ఆయన హెయిర్ స్టైల్ లో మార్పు వచ్చింది. క్యాజువల్ ఫ్యాంట్, షర్ట్ లో అఫీషియల్ లుక్ లో కనిపిస్తున్నారు. క్యాబినెట్ సమావేశాలతో పాటు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు అలానే వస్తున్నారు. ఈ న్యూ లుక్ ను ఆయన ఎంత మజా చేస్తున్నారో తెలియదు కానీ.. జనసైనికులు మాత్రం చాలా ఆనందంతో గడుపుతున్నారు.అయితే ప్రజలతో పాటు జనసైనికులు పవన్ కళ్యాణ్ విషయంలో రెండు పద్ధతుల్లో ఫీల్ అవుతుంటారు. ఒకటి అభిమాన కథానాయకుడు, ఆపై ఇష్టమైన నేత. అందుకే పవన్ కళ్యాణ్ ఎక్కడికి వెళ్లినా అదే క్రేజ్. చివరకు మంత్రివర్గ సమావేశాలు అయినప్పుడు, మంత్రులు ప్రత్యేకంగా కలుసుకున్నప్పుడు పవన్ కళ్యాణ్ తో ఫోటోలు దిగేందుకు తోటి మంత్రులు కూడా ఆసక్తి చూపుతుంటారు. అంతలా ఉంటుంది ఆయన చరిష్మ. ఆపై ప్రజల విషయంలో ఆయన వ్యవహార శైలి కూడా అలానే ఉంటుంది. చాలా అంకితభావంతో పనిచేస్తారు. అయితే గత కొంతకాలం కిందట వరకు ఆయన సాధారణ వస్త్రాలతోనే కనిపించేవారు. కానీ ఇటీవల అఫీషియల్ లుక్ తో కనిపిస్తున్నారు. ఇది జనసైనికులకు ముమ్మాటికి ఇష్టపడే విషయం కూడా. అయితే పవన్ కళ్యాణ్ ఎలా ఉన్నా ప్రత్యర్థులకు నచ్చదు. ఎందుకంటే ఆయన వారి ఓటమిపై అంతలా ప్రభావం చూపారు కాబట్టి. అందుకే ఆయన అదిరేటి డ్రెస్ వేసినా వారికి నచ్చదు. అభిమానులు మాత్రం పవన్ కళ్యాణ్ ను చూసి ఫిదా అవుతున్నారు.

# 30 ఏళ్ల క్రితం... వణికించిన బ్లోఅవుట్

## 8 జనవరి 1995..సాయంత్రం 6:50కి

## ఎగసిపడిన మంటలు

కాకినాడ, జనవరి 7, కోనసీమ అంటే ప్రకృతి అందాలు..పండుగలు..రకరకాల వంటకాలు మాత్రమే అనుకునే రోజుల్లో జరిగిన అగ్ని ప్రమాదం దేశాన్నే వణికించింది. ఓఎన్జీసీ గ్యాస్ లీక్ వల్ల ఏర్పడిన పాశర్లపూడి బ్లో ఔట్ కోనసీమ పేరును దేశ వ్యాప్తంగా గుర్తుండిపోయేలా చేసింది. మరో భోపాల్ దుర్ఘటనలా మారుతుందా అనే విశ్లేషణలు, భయాలు వెలువడేలా చేసిన పాశర్లపూడి బ్లో ఔట్ ఘటన కు 30 ఏళ్ళు పూర్తయ్యాయి. ప్రస్తుతం కోనసీమ జిల్లాలో మలికిపురం మండలంలోని ఇరుసమండ గ్రామం వద్ద జరిగిన ఓఎన్జీసీ గ్యాస్ లీక్ గురించి అందరూ భయపడుతున్నారు. కానీ దీన్ని మించిన అత్యంత ప్రమాదం 30 ఏళ్ల క్రితమే జరిగింది. అమలాపురానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాశర్లపూడి అనే గ్రామంలో ఓఎన్జీసీ గ్యాస్ డ్రిల్లింగ్ పనులు జరుపుతున్నప్పుడు ఒక్కసారిగా లీకేజ్ ఏర్పడి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అందరూ సంక్రాంతి పండుగకు రెడీ అవుతున్న సమయంలో 8 జనవరి 1995 సాయంత్రం 6:50కి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. 19వ నెంబర్ బావి వద్ద జరిగిన బ్లో ఔట్‌తో మొదలైన అగ్ని జ్వాలలు ఏకంగా 65రోజులపాటు కొనసాగి మార్చి 15 నాటికి అదుపులోకి వచ్చాయి. అన్ని రోజులపాటు అగ్ని జ్వాలలు అలా ఎగసిపడుతుండడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా దేశం అంతా భయపడింది. ప్రభుత్వం వెంటనే అలెర్ట్ అయి చుట్టుపక్కల ఉన్న 7 గ్రామాల ప్రజలను ఖాళీ చేయించింది. ఏదో రెండు మూడు రోజుల్లో మళ్ళీ సొంత ఊరికి వచ్చేస్తామనుకున్న ప్రజలు ఏకంగా రెండు నెలల పాటు తమ ఊళ్లకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. అదృష్టవశాత్తు ఆ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు కానీ ప్రమాదం సంభవించిన రిగ్ నెంబర్ 19 మొత్తం నాశనం అయిపోయింది. ఆ రోజుల్లోనే దాని విలువ 9.2 కోట్లు. అది కాకుండా చుట్టుప్రక్కల ఉన్న సామాగ్రి మొత్తం కాలిపోయింది. వాటి విలువ మరో 7కోట్లు.ఎంత ట్రై చేసినా మంటలు అదుపులోకి రాకపోవడంతో అమెరికాలోని హ్యుస్టన్‌కు చెందిన నీల్ ఆడమ్స్ ఫైర్ ఫైటర్స్ సంస్థ ఇంజనీర్లను రప్పించారు. కానీ వారు చేసిన మొదటి ప్రయత్నాలు ఫలించలేదు. తరువాత మంటలను అదుపు చేయడానికి వారు మరో పథకం వేసినా అది మరింత ప్రమాదమంటూ దానికి ఓఎన్జీసీ అనుమతి ఇవ్వలేదు. చివరకు ఇంటర్‌నేషనల్ వెల్ కంట్రోల్ సంస్థ ఇంజనీర్లు రంగంలోకి దిగి 15 మార్చ్ 1995న మంటలను అదుపులోనికి తీసుకుని రాగలిగారు. ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్లో ఔట్‌గా చరిత్రకెక్కింది. ఏకంగా 200మీటర్ల ఎత్తుకు మంటలు ఎగసిపడ్డాయి.అప్పట్లో బ్లో ఔట్ కారణంగా ఎగడిపడుతున్న మంటలు చాలా కిలోమీటర్ల దూరానికి కనపడేవి. వాటిని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో ప్రజలు కోనసీమ వచ్చేవారు. ప్రస్తుతం అంతా ఒకే అన్నట్టు కనపడుతున్నా 30 ఏళ్ల తర్వాత కూడా బ్లో ఔట్ అన్న మాట వినగానే భయంతో ఉలిక్కిపడుతుంటారు పాశర్లపూడి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు. తాజాగా మలికిపురం బ్లో ఔట్ ప్రమాదంతో ఆనాటి భయంకర పరిస్థితుల గురించి మరోసారి గుర్తు చేసుకుంటున్నారు అప్పటి తరం వారు.

# 2 కోట్ల బంగారు పేపర్లతో భగవద్గీత

ఢిల్లీ, జనవరి 7, ఢిల్లీకి చెందిన ఓ భక్తుడు రూ.2 కోట్ల విలువైన బంగారు పేపర్లతో రూపొందించిన స్వర్ణ భగవద్గీతను తయారు చేయించారు. కర్ణాటకలోని ప్రసిద్ధ ఉడుపి శ్రీకృష్ణ మఠానికి అపురూపమైన కానుక అందింది. 18 అధ్యాయాలు, 700 శ్లోకాలతో రూపొందిన ఈ గ్రంథాన్ని విశ్వగీతా పర్యాయ ముగింపు రోజున మఠాధిపతి విద్యా ధీశతీర్థ స్వామికి అందజేయనున్నారు. జనవరి 8వ తేదీన బంగారు రథంలో ఊరేగింపుగా తీసుకొచ్చి మఠానికి బహూకరించనున్నారు.జనవరి 8న ప్రఖ్యాత శ్రీ కృష్ణ ఆలయంలో అరుదైన, బంగారు పూత పూసిన భగవద్గీతను అందజేయనున్నారు. దీనిని భక్తులు, పండితులు ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక క్షణంగా భావిస్తున్నారు. ఆలయ చారిత్రక ప్రాముఖ్యత, సమర్పించబోతున్న పవిత్ర గ్రంథం. 13వ శతాబ్దంలో జగద్గురు శ్రీ మధ్వాచార్యులు స్థాపించిన ద్వైత తత్వశాస్త్రానికి ప్రముఖ కేంద్రమైన ఉడిపిలోని శ్రీ కృష్ణ ఆలయం, చాలా కాలంగా మతపరమైన పాండిత్యం, భక్తి, సంప్రదాయంతో ముడిపడి ఉంది. ఈ ఆలయంలో బంగారు పూతతో కూడిన భగవద్గీత ఎడిషన్‌ను ప్రవేశపెట్టడం అనేది గ్రంథం కాలాతీత ఔచిత్యానికి, దాని తాత్విక తత్వానికి అద్దం పడుతోంది.బంగారు పూత పూసిన ఈ గ్రంథం సంక్లిష్టమైన పనితనాన్ని ప్రతిబింబిస్తుంది. గ్రంథం పవిత్రత, ప్రామాణికతను కాపాడటంపై ప్రాధాన్యతనిస్తుందని భావిస్తున్నారు. పవిత్ర గ్రంథాలను అటువంటి రూపాల్లో ప్రదర్శించడం ఐశ్వర్యానికి బదులుగా భక్తి, కృతజ్ఞతకు నిదర్శనమని, దానిలో ఉన్న బోధనలపై దృష్టిని ఆకర్షించడానికి ఉపయోగపడుతుందని భక్తులు భావిస్తున్నారు. మహాభారతంలో భాగమైన భగవద్గీత 700 శ్లోకాలను కలిగి ఉంది. విధి, ధర్మం, భక్తి, జీవిత స్వభావానికి సంబంధించిన లోతైన ప్రశ్నలను సంబోధిస్తుంది. దీని బోధనలు ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక ఆలోచన, నీతి, తత్వశాస్త్రాన్ని ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

# ఔను.. వాళ్లిద్దరూ కలిసిపోయారు..

కడప, జనవరి 7, రాజకీయాలు ఎప్పుడు ఒకేలా ఉండవు. వాటి పరిణామాలు కూడా ఒకేలా ఉండవు. శత్రువులు మిత్రులవుతారు. మిత్రులు రాజకీయంగా శత్రువులుగా మారుతారు. ఈ విషయంలో హేమహేమిలే బాధితులు. అయితే తాజాగా వైయస్ షర్మిల తో ఆయన సోదరుడు జగన్మోహన్ రెడ్డి రాజీ చేసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. త్వరలో వారిద్దరూ రాజకీయంగా ఒకటి కానున్నట్లు టాక్ నడుస్తోంది. అందుకు తగ్గట్టుగానే పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల షర్మిల సోదరుడు జగన్ పై విమర్శలు తగ్గించారు. కూటమిపై విమర్శలు పెంచుతున్నారు. అంతకుమించి కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ తగ్గించారు. దీంతో సోదరుడితో ఆమె చేయి కలుపుతారన్న అనుమానాలకు బలం చేకూరుతోంది. అయితే ఈ విషయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ఒకప్పటి సన్నిహితులు చొరవ తీసుకున్నట్లు తెలుస్తోంది.రాజశేఖర్ రెడ్డి వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. తండ్రి అకాల మరణంతో జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచింది ఆ కుటుంబం. అయితే కుటుంబ, ఆర్థికపరమైన, ఆస్తుల పంపకాలకు సంబంధించిన వివాదంలో సోదరుడిని తీవ్రంగా విభేదించారు షర్మిల. అందుకే తెలంగాణలో తండ్రి పేరుతో రాజకీయాలు చేయాలని చూశారు. అక్కడ వర్క్ అవుట్ కాకపోయేసరికి ఏపీకి వచ్చారు. రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని కూడా చూశారు సోదరుడ్ని. కాంగ్రెస్ పార్టీ పగ్గాలు తీసుకొని 2024 ఎన్నికల్లో ఎంతలా డ్యామేజ్ చేయాలో అంతలా చేశారు. చివరకు సొంత జిల్లా కడపలో సైతం రాజశేఖర్ రెడ్డి చరిత్ర మసకబారింది. అయితే రాజకీయాలకు దూరంగా ఉన్న చాలామంది రాజశేఖర్ రెడ్డి సన్నిహితులు ఆ కుటుంబ పరిస్థితిని చూసి ముందుకు వచ్చారు. వారి మధ్య ఉన్న గ్యాప్ ను సరి చేసే పనిలో పడ్డారు. వారి మధ్య జరిగిన చర్చలు విజయవంతం అయినట్లు కూడా తెలుస్తోంది. అందుకే వారు రాజకీయంగా కలిసిపోయేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం.ఏపీ విషయంలో కాంగ్రెస్ హై కమాండ్ ఆలోచన చేయడానికి జగన్ కారణమని తెలుస్తోంది. షర్మిల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు వదిలించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం ఉందట. అయితే షర్మిల ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేస్తారని కూడా ప్రచారం జరిగింది. రాయలసీమ పేరుతో రాజకీయాలు మొదలు పెడతారని కూడా టాక్ నడిచింది. అయితే ఇప్పటికే పార్టీ పెట్టి చేతులు కాల్చుకున్నారు. మరోసారి ఆ పరిస్థితి తెచ్చుకోకూడదని భావిస్తున్నారు. ఇటువంటి సమయంలోనే రాజకీయాలకు దూరంగా ఉన్న కొంతమంది రాజశేఖరరెడ్డి సన్నిహితులు రంగంలోకి దిగారు. అటు బెంగళూరులో ఉన్న జగన్మోహన్ రెడ్డితో.. ఇటు హైదరాబాదులో ఉన్న షర్మిల తో చర్చలు జరిపారట. చాలావరకు సమస్యలకు పరిష్కార మార్గం చూపించారట. అందుకే వారిద్దరూ కలిసిపోయేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. చూడాలి ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయో?

# రిలయన్స్ షేర్లు కుదులు

ముంబై జనవరి 7, (న్యూస్ పల్స్) భారత్‌లోనే అత్యంత ధనవంతుడు, దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి బిగ్ షాక్ తగిలింది. చమురు కార్యకలాపాల్లో ప్రధానంగా ఉన్నటువంటి తన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు  సెషన్‌లో కుదేలయ్యాయి. రికార్డు స్థాయిలో పతనమయ్యాయి. ఇంట్రాడేలో ఏకంగా 5 శాతానికిపైగా పతనం కాగా.. చివరికి 4.50 శాతం వరకు కుప్పకూలింది. రిలయన్స్ వంటి హెవీ వెయిట్ స్టాక్.. ఒక్కరోజు ఈ స్థాయిలో పతనం అవడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. ఇక్కడ స్టాక్ పతనం అయ్యేందుకు ప్రధాన కారణం రష్యా చమురు గురించి సంస్థకు లింక్ పెడుతూ వార్తలు రావడం. అవును.. ఇప్పటికే రష్యా ముడిచమురు కంపెనీలపై అమెరికా, ఐరోపా దేశాలు ఆంక్షలు విధించాయి. అలాంటి రష్యా నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికీ ముడిచమురు దిగుమతి చేసుకుంటోందంటూ బ్లూమ్‌బెర్గ్ రిపోర్ట్ వెలువరించడం దీనికి కారణం.ఇక్కడ ముడిచమురును దిగుమతి చేసుకొని రిలయన్స్ ఇండస్ట్రీస్.. తన గుజరాత్ జామ్‌నగర్ రిఫైనరీలో శుద్ధి చేసి పెట్రోల్, డీజిల్ వంటి వాటిని ఐరోపా దేశాలకు ఎగుమతి చేస్తుంటుంది. ఇక్కడే ఆయా దేశాల ఆంక్షల్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉల్లంఘించినట్లు వార్తలు వచ్చాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ దీనిని ఖండించి.. పచ్చి అబద్ధం అని ప్రకటించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. ఒకవైపు మార్కెట్లు భారీగా పడిపోతుండగా.. రిలయన్స్ షేరు కూడా కుదేలైంది. అంతకుముందు సెషన్‌లో రిలయన్స్ షేరు రూ. 1578.10 వద్ద ముగియగా.. జనవరి 6న ఒక దశలో ఇంట్రాడేలో 5 శాతానికిపైగా పతనమైంది. ఈ క్రమంలో రూ. 1496.30 వద్ద కనిష్ఠ స్థాయిని తాకింది. ఇక్కడ చూస్తే రిలయన్స్ మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో రూ. 1 లక్ష కోట్లకుపైగా తగ్గడం గమనార్హం. అంటే ఈ స్థాయిలో ఇన్వెస్టర్లు డబ్బులు పోగొట్టుకున్నారు. 2024, జూన్ 4 తర్వాత ఈ స్టాక్ ఇంతలా పతనం అవడం ఇదే తొలిసారి. చివరకు 4.50 శాతం వరకు నష్టంతో రూ. 1507.60 వద్ద స్థిరపడింది. సంస్థ మార్కెట్ విలువ రూ. 20.40 లక్షల కోట్లకు పడిపోయింది. స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 1611.80 కాగా.. కనిష్ఠ ధర రూ. 1114.85 గా ఉంది. నిఫ్టీ 50 స్టాక్స్‌లో అత్యధికంగా పడిపోయింది కూడా రిలయన్స్ ఇండస్ట్రీసే. ఇక బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ నష్టంలో 82 పాయింట్లు తగ్గేందుకు రిలయన్స్ ఇండస్ట్రీసే కారణం. అంతకుముందు ఏడాది వ్యవధిలో రిలయన్స్ షేరు 20 శాతానికిపైగా పెరిగినా.. ఇప్పుడు ఒక్కసారిగా భారీగా దిగిరావడం ఇన్వెస్టర్లలో ఆందోళనలకు కారణమైంది.

# ఏపీలో ఉపాధి పోరు

విజయవాడ, జనవరి 7,ఒకరిది ఉనికి కోసం పోరాటం. మరొకరిది ఆధిపత్యం కోసం ఆరాటం. పేదల కోసం తాము ఎంతో ఆలోచించి తెచ్చిన పథకం రూపురేఖలు మార్చారని కాంగ్రెస్..అప్పటి కంటే ఇంకా గొప్పగా తీర్చిదిద్దామని బీజేపీ ఎవరి వాదన వారిది. ఈ నేపథ్యంలో ఏపీలో ఇంట్రెస్టింగ్‌గా పొలిటికల్ సీన్ కనిపిస్తోంది. ఆఫ్టర్ ఏ లాంగ్ నవ్యాంధ్ర సెంట్రిక్‌గా..జాతీయ పార్టీలైనా..కాంగ్రెస్, బీజేపీ ఎత్తుకు పైఎత్తు పాలిటిక్స్‌కు తెరలేపాయి.విభజన తర్వాత ఏపీలో డిపాజిట్లు కూడా దక్కించుకోలేని పరిస్థితిల్లో..వెంటిలేటర్ మీద కొనసాగుతోన్న హస్తం పార్టీ..అదును చూసి కమలం పార్టీని కార్నర్ చేసే స్కెచ్ వేస్తోంది. సరిగ్గా ఇదే టైమ్‌లో ఉపాధి హామీ పథకంలో మార్పులు తెస్తూ మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్‌కు అతిపెద్ద అస్త్రంగా మారింది. ఓవైపు పార్లమెంట్‌లో..దేశవ్యాప్తంగా ఎన్డీయే సర్కార్ తీరుకు నిరసనగా విమర్శల దాడి చేస్తూనే ఉంది హస్తం పార్టీ.సేమ్‌టైమ్ గతంలో ఏపీ వేదికగా పురుడు పోసుకున్న ఉపాధి స్కీమ్‌లో..ఇప్పుడు కేంద్రం తెచ్చిన మార్పులను వ్యతిరేకిస్తూ.. రాయలసీమ సెంట్రిక్‌గా అతిపెద్ద ప్రొటెస్ట్‌కు వ్యూహాలు రచిస్తోంది. దీంతో కాంగ్రెస్ స్కెచ్‌కు చెక్ పెట్టేందుకు..ఏపీలోనే హస్తం పార్టీ దూకుడుకు బ్రేకులు వేసేందుకు కమలం పార్టీ వేస్తున్న ప్లాన్స్..పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యూపీఏ సర్కార్-1 హయాంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. 2006 ఫిబ్రవరి నెలలో ఏపీలోని అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని బండ్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అయితే లేటెస్ట్‌గా ఉపాధి హామీ పథకం పేరును జీ రాం జీ స్కీమ్‌గా పేరు మార్చింది కేంద్రఅంతేకాదు ఉపాధి హామీ రూపురేఖలనే మార్చేసింది. మోదీ సర్కార్ నిర్ణయానికి వ్యతిరేకంగా..ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది కాంగ్రెస్ పార్టీ. ఏపీ సెంట్రిక్‌గా ప్రారంభమైన పథకంపై..అదే చోట కేంద్రం తీరుకు నిరసనగా..అతిపెద్ద ప్రొటెస్ట్‌కు ప్లాన్ చేస్తోంది.

ఫిబ్రవరి 2న అనంతపురం జిల్లా బండ్లపల్లిలో షర్మిల దీక్ష చేయబోతున్నారు.ఈ సభకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే అటెండ్ వస్తారని అంటున్నారు. ఏఐసీసీ అగ్రనేతలు కనుక ఈ దీక్షకు వస్తే.. దేశవ్యాప్త చర్చకు దారితీయడం ఖాయం. దీంతో కాంగ్రెస్‌కు ధీటుగా బీజేపీ పెద్ద స్కెచ్చే వేసిందట. ఏపీలో కాంగ్రెస్ విమర్శలను చెక్ పెట్టాలని..జీ రాం జీ స్కీమ్‌లో తెచ్చిన మార్పులతో మేలెంత అన్నది వివరించేందుకు రెడీ అయిందిఈ మధ్యే అటల్ బిహారీ వాజ్ పేయ్ శతజయంతి ఉత్సవాల పేరుతో ప్రజల్లోకి వెళ్లారు ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పీవీఎన్ మాధవ్. ఇప్పుడు ఆయనకు ఇంకో టాస్క్ అప్పగించిందట బీజేపీ అధినాయకత్వం. జీ రాం జీ చట్టంపై..అంటే ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన మార్పులతో ఎంత మేలు జరగబోతోందో వివరించేందుకు పీవీఎన్ మాధవ్ యాత్ర చేపట్టబోతున్నారట.ఏపీలోని అన్ని జిల్లాలలో సభలు, సమావేశాలు పెడుతూ కొత్త చట్టం ద్వారా ప్రజలకు ఎంత ఉపయోగం జరగనుంది..గతానికి కంటే ఎక్కువగా కలిగే ప్రయోజనం ఏమిటనేది వివరించాలని చూస్తున్నారట.

గతంలో ఉన్న 100 పని దినాలను 125 రోజులకు పెంచడంతో పాటు..పేదలను దృష్టిలో పెట్టుకుని పలు నిర్ణయాలను తీసుకున్నట్లు ఎక్స్‌ప్లెయిన్ చేస్తారట.కేంద్రం జాతీయ ఉపాధి హామీ పథకానికి గండి కొడుతోందని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి ఇక్కడే స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వాలనేది కమలనాథుల వ్యూహంటున్నారు. అందుకే పీవీఎన్ మాధవ్‌తో యాత్రకు శ్రీకారం చుడుతున్నారని..ఈ యాత్రకు కేంద్రమంత్రులు, జాతీయ నేతలను కూడా తరలివచ్చి..కాంగ్రెస్ అలిగేషన్స్‌పై కౌంటర్ ఇవ్వడంతో పాటు..కమలం పార్టీకి ఇంకింత మైలేజ్ తెచ్చే ప్లాన్ చేస్తున్నారట. ఇలా ఉపాధి హామీ పథకంపై..ఏపీ సెంట్రిక్‌గా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ పొలిటికల్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారేలా కనిపిస్తోంది.

# ఆర్థిక సంక్షోభంలోనూ వెనిజులా

న్యూఢిల్లీ, జనవరి 7, (న్యూస్ పల్స్) వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో పాలనలో ఆ దేశానికి చెందిన విలువైన బంగారు నిల్వలు భారీ ఎత్తున విదేశాలకు తరలిపోయినట్లు తాజా కస్టమ్స్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా 2013 నుంచి 2016 మధ్య కాలంలో సుమారు 5.20 బిలియన్ డాలర్ల  విలువైన బంగారాన్ని వెనిజులా నుంచి స్విట్జర్లాండ్‌కు తరలించినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడిస్తున్నాయి.నికోలస్ మదురో 2013లో వెనిజులా అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆ దేశ ఆర్థిక పరిస్థితి గందరగోళంలో పడింది. ఆ మూడేళ్ల కాలంలోనే దాదాపు 113 మెట్రిక్ టన్నుల స్వచ్ఛమైన బంగారాన్ని స్విట్జర్లాండ్‌కు తరలించారు. వెనిజులా సెంట్రల్ బ్యాంక్ వద్ద ఉన్న నిల్వల నుంచే ఈ బంగారం తరలిపోయినట్లు స్విస్ బ్రాడ్‌కాస్టర్ 'ఎస్ఆర్ఎఫ్' ధ్రువీకరించింది. దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకోవడానికి, నగదు లభ్యత కోసం ప్రభుత్వం ఈ బంగారాన్ని విక్రయించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోనే గోల్డ్ రిఫైనింగ్‌కు స్విట్జర్లాండ్ ప్రధాన కేంద్రం కావడంతో.. అక్కడ శుద్ధి చేయడం, ధ్రువీకరణ పొందడం కోసం ఈ బంగారాన్ని పంపినట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.యూరోపియన్ యూనియన్ వెనిజులాపై ఆంక్షలు విధించిన 2017 సంవత్సరం నుంచి ఈ ఎగుమతులు ఒక్కసారిగా నిలిచిపోయాయి. మానవ హక్కుల ఉల్లంఘన, ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నారనే ఆరోపణలతో వెనిజులాకు చెందిన కీలక వ్యక్తులపై ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. స్విట్జర్లాండ్ కూడా 2018 ఆరంభంలో ఈ ఆంక్షలను స్వీకరించింది. వెనిజులా సెంట్రల్ బ్యాంక్ వద్ద నిల్వలు నిండుకోవడం వల్ల కూడా ఎగుమతులు ఆగిపోయి ఉండొచ్చని మార్కెట్ విశ్లేషకురాలు రోనా ఓ కానెల్ అభిప్రాయపడ్డారు.ఇటీవల జనవరి 3న కరాకస్‌లో జరిగిన ఆకస్మిక దాడిలో అమెరికా ప్రత్యేక దళాలు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకున్నాయి. ప్రస్తుతం ఆయన న్యూయార్క్ కోర్టులో డ్రగ్ ట్రాఫికింగ్, నార్కో-టెర్రరిజం వంటి తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం స్విట్జర్లాండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మదురోతో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులైన మరో 36 మందికి సంబంధించిన ఆస్తులను స్విస్ బ్యాంకులు స్తంభింపజేశాయి.

అయితే వెనిజులా సెంట్రల్ బ్యాంక్ నుంచి తరలిన బంగారానికి, ప్రస్తుతం ఫ్రీజ్ చేసిన ఆస్తులకు మధ్య ఉన్న సంబంధంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.వెనిజులా ప్రజలు తీవ్ర ఆకలితో, ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న సమయంలోనే ఇంత భారీ సంపద దేశం దాటడం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఆ బంగారం ఆసియా మార్కెట్లలో విక్రయించబడిందా లేక ఆర్థిక సంస్థల వద్దే ఉండిపోయిందా అనే కోణంలో దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయి.

# ప్రయాగ్‌రాజ్‌లో 44 రోజుల పాటు మాఘ మేళా..

అలహాబాద్, జనవరి 7, (న్యూస్ పల్స్) ప్రయాగ్‌రాజ్‌లో 44 రోజుల పాటు సాగే మాఘ మేళా మొదలైంది. 2025లో నిర్వహించిన మహా కుంభమేళాకు మన దేశ నలుమూలల నుంచే కాకుండా.. ప్రపంచ దేశాల నుంచి.. కోట్లాది మంది భక్తులు వచ్చారు. ఇప్పుడు మాఘ మేళాకు కూడా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది.ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో గతేడాది మహా కుంభమేళా జరగ్గా.. ప్రస్తుతం మరో మాఘ మేళా మొదలైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనంగా రికార్డుల్లోకి ఎక్కింది. అయితే ఈసారి అక్కడ మాఘ మేళా నిర్వహిస్తున్నారు. మొత్తం 44 రోజుల పాటు సాగే ఈ మాఘ మేళా.. పౌష పూర్ణిమ నుంచి మహాశివరాత్రి వరకు కొనసాగనుంది. ఈ ఉత్సవంలో కోట్లాది మంది భక్తులు సంగమ స్నానాలు ఆచరించనున్నారు. ఈ మాఘ మేళాకు విచ్చేసే భక్తుల కోసం యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత, రవాణా ఏర్పాట్లు చేసింది. కుంభమేళా స్థాయి ఆధ్యాత్మిక అనుభూతిని ప్రశాంతమైన వాతావరణంలో పొందాలనుకునే వారికి ఈ మేళా సరైన వేదిక అని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.పవిత్ర త్రివేణి సంగమం వద్ద మాఘ మేళా 2026 అట్టహాసంగా ప్రారంభమైంది. జనవరి 3వ తేదీన పౌష పూర్ణిమ పుణ్యస్నానంతో మొదలైన ఈ ఆధ్యాత్మిక ఉత్సవం ఫిబ్రవరి 15వ తేదీన మహాశివరాత్రి వరకు మొత్తం 44 రోజుల పాటు కొనసాగనుంది. కుంభమేళాతో పోలిస్తే తక్కువ రద్దీ.. ప్రశాంతమైన వాతావరణంలో భక్తి పారవశ్యాన్ని పొందేవారికి ఇది ఒక చక్కని అవకాశంగా మారనుంది.గతేడాది జరిగిన మహా కుంభమేళా రద్దీతో పోలిస్తే.. ఈ మాఘ మేళా భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. గంగ, యమున, అంతర్వాహిని అ?న సరస్వతీ నదుల కలయిక అయిన త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానం ఆచరించడం వల్ల పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. మాఘ మేళా ప్రారంభ తొలి రోజు అయిన పౌష పూర్ణిమ నాడే సుమారు 21.5 లక్షల మంది భక్తులు సంగమ తీరంలో పవిత్ర స్నానాలు ఆచరించారు.ఈ మేళాలో ఆరు ప్రధాన స్నాన దినాలు ఉన్నాయి. మకర సంక్రాంతి (జనవరి 14), మౌని అమావాస్య (జనవరి 18), వసంత పంచమి (జనవరి 23), మాఘీ పూర్ణిమ (ఫిబ్రవరి 1), మహాశివరాత్రి (ఫిబ్రవరి 15).. ఈ రోజుల్లో త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. భక్తుల సౌకర్యార్థం 800 హెక్టార్ల మేళా ప్రాంతాన్ని 7 సెకార్లుగా విభజించారు. సుమారు 3800 ప్రత్యేక బస్సులు.. 42 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.ఈ మాఘ మేళాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 17 పోలీస్ స్టేషన్లు, 42 అవుట్ పోస్టులు, 400 సీసీటీవీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచారు. మెడికల్ ఎమర్జెన్సీ కోసం మాఘ మేళా ప్రాంగణంలోనే రెండు 20 పడకల ఆస్పత్రులను నిర్మించారు.ప్రతీ 12 ఏళ్లకు ఒకసారి అత్యంత భారీ స్థాయిలో జరిగేది కుంభమేళా. అయితే ఈ మాఘ మేళా మాత్రం ప్రతీ సంవత్సరం నిర్వహిస్తారు. కుంభమేళాలో ఉండే సాధువుల సమాగమం, దానధర్మాలు, హారతులు, ఆధ్యాత్మిక చర్చలు అన్నీ మాఘ మేళాలోనూ ఉంటాయి. కానీ కుంభమేళాతో పోల్చితే.. మాఘ మేళాలో భక్తుల రద్దీ కొంత తక్కువగా ఉంటుంది.

# స్పైగా చిన్నపిల్లలు...

ఢిల్లీ, జనవరి 7, (న్యూస్ పల్స్) పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఇప్పుడు మైనర్ భారతీయ పిల్లలను లక్ష్యంగా చేసుకుంటోంది. గూఢచర్యం ఆరోపణలపై పఠాన్‌కోట్ పోలీసులు 15 ఏళ్ల బాలుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆ బాలుడు గత ఏడాది కాలంగా పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ నిర్వాహకులకు భారతదేశం గురించి సున్నితమైన, ముఖ్యమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. పక్కా సమాచారంతో బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పంజాబ్‌లోని ఇతర జిల్లాల్లోని ఇతర మైనర్లతో పాటు ఈ బాలుడు కూడా సంబంధంలో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ విషయం తీవ్రత దృష్ట్యా, పోలీసులు పంజాబ్‌లో వివిధ పోలీస్ స్టేషన్‌లను అప్రమత్తం చేశారు. తదుపరి దర్యాప్తు జరుగుతోంది.జమ్మూలోని సాంబా జిల్లాకు చెందిన ఆ బాలుడు గత ఏడాది కాలంగా పాకిస్తాన్‌లో ఉన్న ఐఎస్ఐ నిర్వాహకులకు భారతదేశానికి సంబంధించిన కీలకమైన సమాచారాన్ని పంపుతున్నాడని అధికారులు మంగళవారం తెలిపారు. సున్నితమైన సైనిక ప్రదేశాల ఫోటోలు, సమాచారాన్ని పంచుకున్నాడని, అతని మొబైల్ నుండి చాట్‌లు, కాల్ రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. విచారణ సమయంలో, పంజాబ్‌లోని అనేక ఇతర జిల్లాల్లోని చిన్న పిల్లలు ఐఎస్ఐతో సంబంధాలు కలిగి ఉన్నాయన్న విషయం వెల్లడైంది. పట్టుబడిన బాలుడి వయస్సు కేవలం 15 సంవత్సరాలు మాత్రమేనని, పాకిస్తాన్‌లోని ఐఎస్ఐతో అతను సంబంధాలు కలిగి ఉన్నాడని పఠాన్‌కోట్ ఎస్ఎస్‌పి తెలిపారు.పఠాన్‌కోట్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ దల్జిందర్ సింగ్ ధిల్లాన్ మీడియాతో మాట్లాడుతూ, ఉగ్రవాద సంస్థలు, ఐఎస్ఐ, పాకిస్తాన్ సైనిక అధికారులకు దేశ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తున్నట్లు సమాచారం అందిన తర్వాత పోలీసులు ఆ బాలుడిని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. తన తండ్రి హత్యకు గురయ్యాడనే అనుమానం వచ్చి, ఆ బాలుడు సోషల్ మీడియా ద్వారా పాకిస్తాన్ ఏజెన్సీల ఉచ్చులో పడ్డాడు. అది తనను మానసికంగా ప్రభావితం చేసిందని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అన్నారు. పాకిస్తాన్‌కు చెందిన హ్యాండ్లర్లతో అతని కమ్యూనికేషన్లను అనుసంధానించిన నిఘా, సాంకేతిక విశ్లేషణ తర్వాత, మైనర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారువిచారణలో, ఆ బాలుడు ఒంటరిగా పనిచేయడం లేదని పోలీసులు గుర్తించారు. ఇంకా చాలా మంది పిల్లలు ఏొఎ కార్యకర్తలతో సంబంధాలు కలిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. దీని కారణంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశారు. వివిధ ప్రాంతాల్లోని ఇతర పిల్లలను గుర్తించడానికి హెచ్చరికలు జారీ చేశారు

# 8 వేల కోట్లతో  మంచినీటి సరఫరాకు ప్రణాళికలు

హైదరాబాద్, జనవరి 7, హైదరాబాద్ సిటీలో తాగునీటి ఎద్దడి లేకుండా, అన్ని ప్రాంతాలకు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేందుకు జలమండలి రూ. 8,000 కోట్ల భారీ వ్యయంతో ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరానికి నీటిని అందించే కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా మరియు జంట జలశయాల (ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్) వనరులను ఒకే గొడుగు కిందకు తెస్తూ, నగరం చుట్టూ 140 కిలోమీటర్ల మేర 'రేడియల్ రింగ్ మెయిన్' పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు  వెంబడి ప్రధాన పైపులైన్లు వేసి, దానికి అనుసంధానంగా మరో 96 కిలోమీటర్ల మేర అంతర్గత నెట్‌వర్క్‌ను నిర్మించడం ద్వారా నగరం నలుమూలలకూ నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనున్నారుగతంలో కేవలం జంట జలశయాలపై ఆధారపడిన నగరం, ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల నుండి నీటిని పొందుతోంది. అయితే, ఏదైనా ఒక ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు జరిగినా లేదా సాంకేతిక సమస్యలు తలెత్తినా ఆయా ప్రాంతాల్లో సరఫరా పూర్తిగా నిలిచిపోతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు 'రింగ్ మెయిన్' వ్యవస్థ కీలకం కానుంది. దీనివల్ల ఒక మార్గంలో అంతరాయం కలిగినా, ఇతర వనరుల నుండి నీటిని మళ్లించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయవచ్చు. రాబోయే రెండేళ్లలో గోదావరి 2, 3 దశలు కూడా అందుబాటులోకి రానుండటంతో, ఈ రింగ్ మెయిన్ ద్వారా 24 గంటల పాటు సమాన ఒత్తిడితో నీటిని అందించడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.హైదరాబాద్ సిటీకి అంతరాయం లేని తాగునీటి సరఫరాను అందించేందుకు ప్రతిపాదించిన అత్యంత కీలకమైన పైపులైన్ నెట్‌వర్క్‌ను 'రింగ్ మెయిన్' అని పిలుస్తారు. ప్రధానంగా హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఈ ప్రధాన పైపులైన్‌ను ఒక వలయంలా  ఏర్పాటు చేస్తారు. ఇది నగరంలోని పలు ప్రాంతాలను కలుపుతూ ఉండే ప్రత్యేక పైపులైన్లతో అనుసంధానమై ఉంటుందిసాధారణంగా ఏదైనా ఒక ప్రధాన పైపులైన్ దెబ్బతింటే ఆ ప్రాంతానికి నీటి సరఫరా నిలిచిపోతుంది. కానీ, ఈ రింగ్ మెయిన్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే, ఒక దిశలో మరమ్మతులు జరుగుతున్నప్పటికీ, వలయంలా ఉన్న ఇతర పైపులైన్ల ద్వారా నీటిని మళ్లించి నిరంతరాయంగా సరఫరా చేయడానికి వీలుంటుందని అధికారులు ప్లాన్ చేశారు. దీనివల్ల నగరవ్యాప్తంగా నీటి పంపిణీలో ఎలాంటి అవాంతరం లేకుండా నియంత్రించవచ్చు.హైదరాబాద్ నగరానికి ప్రస్తుతం రోజుకు సుమారు 600 మిలియన్ గ్యాలన్లు పైగా నీటి అవసరం ఉంది. కృష్ణా (మూడు దశలు), గోదావరి (మొదటి దశ) ద్వారా మెజారిటీ అవసరాలు తీరుతున్నాయి.రిజర్వాయర్లు నిర్మాణం: రింగ్ మెయిన్ ప్రాజెక్టులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి కీలక ప్రాంతాల్లో భారీ స్టోరేజ్ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. ఇది భవిష్యత్తులో పెరిగే జనాభా అవసరాలకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది.డిజిటల్ మానిటరింగ్: ఈ కొత్త పైపులైన్ వ్యవస్థలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నా లేదా నీటి ఒత్తిడి తగ్గినా వెంటనే గుర్తించేలా అత్యాధునిక స్కాడా టెక్నాలజీని ఉపయోగించే అవకాశం ఉంది. భూగర్భ జలాలపై ఆధారపడటాన్ని తగ్గించి, ఉపరితల జలాలను (నదీ జలాలు) శాస్త్రీయంగా వినియోగించుకోవడం ఈ ప్రాజెక్ట్ మరో ముఖ్య ఉద్దేశ్యం.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతి..

## బుధవారం వేకువ జామున ఘటన..

కొవ్వూరు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో బుధవారం వేకువ జామున రోడ్డు ప్రమాదం జరిగింది. కొవ్వూరు ఫ్లైఓవర్ పై  వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అకస్మాత్తుగా పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ సంఘటనతో ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొనగా, కొంత సేపు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది.

మంటలు చెలరేగిన వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ తక్షణమే బస్సును రోడ్డుపక్కకు నిలిపివేయడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న ఆరుగురు ప్రయాణికులు, నలుగురు సిబ్బంది వేగంగా కిందికి దిగిపోయారు.

ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు. ఈ ఘటనలో దాదాపు రూ.80 లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు.

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

# జనవరి 9వ తేది నుండి ఆన్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్లు జారీ

## నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా అమలు

## తిరుమలలో ఆఫ్ లైన్ శ్రీవాణి దర్శన టికెట్ల జారీ నిలిపివేత

తిరుమల భక్తుల సౌకర్యార్థం, పరిపాలనా అవసరాల దృష్ట్యా టీటీడీ శ్రీవాణి దర్శన టికెట్ల జారీ విధానంలో మార్పులు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు తిరుమలలో ఆఫ్లైన్ కౌంటర్ల ద్వారా జారీ చేస్తున్న టికెట్లను జనవరి 9 నుండి రోజువారి ఆన్లైన్ కరెంట్ బుకింగ్ విధానంలో కేటాయించనున్నారు.

ఈ మేరకు తిరుమలలో రోజువారి విధానంలో ఆఫ్లైన్ ద్వారా జారీ చేస్తున్న 800 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్లైన్ ద్వారా రోజూవారి కరెంట్ బుకింగ్లోకి మార్చనున్నారు. ఈ టికెట్లను ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఆన్లైన్లో విడుదల చేసి, మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంచుతారు. టికెట్ పొందిన భక్తులు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

ఒక్క కుటుంబానికి 1+3 సభ్యులు (మొత్తం నలుగురు) మాత్రమే టికెట్ బుకింగ్కు అనుమతి ఉంటుంది. టికెట్ల బుకింగ్ లో దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఆధార్ ధృవీకరణ, మొబైల్ నంబర్ వంటి వివరాలు తప్పనిసరి. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వడ్ విధానంలో భక్తులు టికెట్లు బుక్ చేసుకోవచ్చు. తద్వారా ఆఫ్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్ల కోసం భక్తులు క్యూలైన్ లో నిరీక్షించే సమస్య తొలగిపోతుంది. ఈ నూతన విధానాన్ని నెల రోజులపాటు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు.

అదేవిధంగా రోజుకు 500 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్ లైన్ అడ్వాన్స్ బుకింగ్ విధానంలో ఇప్పటికే విడుదల చేయడం జరిగింది. మూడు నెలల అనంతరం ఈ విధానంపై సమీక్షించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

తిరుపతి విమానాశ్రయంలో ప్రతిరోజూ భక్తులకు ఆఫ్ లైన్ విధానంలో జారీ చేస్తున్న 200 టికెట్ల జారీ విధానం కూడా యథావిధిగా కొనసాగనుంది.

అన్ని వర్గాల భక్తులను దృష్టిలో ఉంచుకుని టీటీడీ తీసుకున్న నిర్ణయాన్ని గమనించి భక్తులు తమ దర్శన ప్రణాళికలను రూపొందిచుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది.

# చంపేస్తున్న చలి

వరంగల్, జనవరి 7, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు తగ్గుముఖం పట్టాయి. అయితే తెలంగాణ రాష్ట్రంలో చలి పులి చంపేస్తోంది. రాగల రోజుల్లో చలి మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ శాఖ.. రోజురోజుకీ పెరుగుతున్న చలి తీవ్రతకి వృద్ధులు, చిన్న పిల్లలు అధికంగా అనా రోగ్యానికి గురవుతున్నారు. చలి అంటే అందరికీ సహజసిద్ధమైన ఋతువు. కానీ చల్లని గాలులు, ఉదయాన్నే కమ్మేసే పొగమంచు, రాత్రివేళల్లో చలికాలం తెచ్చే వణుకు ఇవన్నీ శరీరానికి కొంత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. సాధారణంగా చలి కాలం ఆనందదాయకమైనదే అయినా, ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోకపోతే పులిలా దాడి చేసే ప్రమాదం ఉంటుంది.అందుకే ఈ సీజన్ను సరిగ్గా ఎదుర్కోవడం చాలా అవసరం. అయితే ములు గు జిల్లాలో ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాం తం కాబట్టి చుట్టూ పక్కన పల్లెల్లో చలి తీ వ్రత రోజురోజుకు చలి విపరీతంగా పెరిగిపోతోంది. ప్రతిరోజు తెల్లవారుజామున పొగ మంచు విపరీతంగా పడుతోంది. ఈ పొగమంచుకి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ చలి తీవ్రతకి మండలంలోని గ్రామాల ప్రజలు బయటికి రావడం లేదు. వృద్ధులు, చిన్నారులు మాత్రం అనారోగ్యబారిన పడుతున్నారు.చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్న పిల్లలపైనే అధిక ప్రభావం పడే అవకాశాలు ఎక్కువగా ఉంది. వృద్ధులు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలు చలి ప్రభావానికి ఎక్కువగా గురవుతారు. శరీర ఉష్ణోగ్రత త్వరగా తగ్గిపోవడం వల్ల వారిలో శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, దమ్ము వంటి వ్యాధులు తలెత్తే అవకాశం ఉంది. చలికాలంలో బిగుతైన, వేడిగా ఉంచే దుస్తులు ధరించడం తప్పనిసరి. చిన్నపిల్లల్లో గురక, ఎగశ్వాస, జలుబు, డబ్బు వంటి లక్షణాలు అధికంగా ఉంటుంది. శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడతారు.ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారు చల్లని వాతావరణంలో ఎక్కువసేపు ఉండకూడదు. బయటకు వెళ్లేటప్పుడు ముక్కు, చెవులు, మెడ కప్పుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. గోరువెచ్చని నీటిని తరచూ త్రాగడం, పొడి వాతావరణంలో తేమను నిలుపుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.చలికాలంలో శరీరం వేడిని కోల్పోతుంది. అందుకే వేడి పానీయాలు, సూపులు, గోరువెచ్చని నీరు తాగడం శరీర రక్షణకు ఉపకరిస్తుంది. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

# బ్లోఅవుట్ అదుపునకు మరికొన్ని రోజులు

కోనసీమ ఇరుసుమండలో గ్యాస్ బ్లోఅవుట్ తీవ్రత తగ్గినప్పటికీ పూర్తిగా అదుపులోకి రాలేదు. ప్రస్తుతం 10-15ఓ మేర మంటలు ఎగిసిపడుతున్నాయి. అగ్నికీలలు వ్యాప్తి చెందకుండా, వేడి పెరగకుండా మోటార్ల ద్వారా నిత్యం నీటిని వెదజల్లుతున్నారు. ఢిల్లీ, ముంబై, డెహ్రాడూన్ నుంచి వచ్చిన నిపుణులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మంటలు పూర్తిగా ఆగడానికి మరికొన్ని రోజులు పట్టొచ్చని అంచనా వేస్తున్నారు.

# ఆత్మగౌరవ నినాదం - తెలంగాణ సెంటిమెంట్

హైదరాబాద్, జనవరి 7, తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత శాసనమండలి వేదికగా కన్నీరు పెట్టుకోవడం, ఆ వెంటనే తెలంగాణ జాగృతి ని రాజకీయ శక్తిగా మారుస్తానని ప్రకటించడం వెనుక అత్యంత పకడ్బందీగా రూపొందించిన ఎమోషనల్ పొలిటికల్ స్ట్రాటజీ కనిపిస్తోంది. కుటుంబ బంధాలను తెంచుకున్నట్లు ప్రకటించడం ద్వారా ఆమె ఒక రకమైన సానుభూతి వాతావరణాన్ని సృష్టించుకునే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో సానుభూతి అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధం. కవిత తన ప్రసంగంలో పుట్టింటి నుంచి అవమానభారంతో బయటకు వచ్చాను అని చెప్పడం ద్వారా తనను ఒక బాధిత ఆడబిడ్డ గా చిత్రించుకున్నారు. తెలంగాణ సమాజంలో ఆడబిడ్డలకు, సెంటిమెంట్కు ఇచ్చే ప్రాధాన్యతను ఆమె సరిగ్గా వాడుకున్నారు. ముఖ్యంగా కుటుంబ పెద్దల నుంచి లేదా సొంత పార్టీ నుంచి తనకు అన్యాయం జరిగిందని చెప్పడం ద్వారా, ప్రజల్లో తన పట్ల ఒక రకమైన సానుభూతి కలిగేలా చేయడంలో ఆమె ప్రాథమికంగా విజయం సాధించారుకవిత తన పోరాటాన్ని నేరుగా బీఆర్ఎస్ నాయకత్వంపైకి మళ్లించడం ద్వారా ఆ పార్టీలో ఉన్న అసంతృప్త నేతలకు, క్యాడర్కు ఒక దిక్సూచిగా మారాలని చూస్తున్నారు. ప్రశ్నిస్తే కక్షగడతారా అనే ప్రశ్న వేయడం ద్వారా బీఆర్ఎస్లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని ఆరోపించారు. ఇది కేవలం పార్టీపై కోపం మాత్రమే కాదు, బీఆర్ఎస్ ఓటు బ్యాంకును లేదా అసంతృప్త నాయకత్వాన్ని తన వైపు తిప్పుకోవడానికి వేసిన ఒక వ్యూహాత్మక అడుగు. కవిత కొత్త పార్టీ పెడుతున్నట్లు ప్రకటించడం హఠాత్తుగా జరిగింది కాదు. చాలా కాలంగా ఆమె జాగృతి ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు దానికి రాజకీయ రంగు అద్దడం ద్వారా, తనకంటూ ఒక సొంత సైన్యం ఇప్పటికే సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చారు. కేవలం సెంటిమెంట్తోనే కాకుండా, గత పదేళ్లుగా తాను చేసిన సామాజిక సేవను ఓట్లుగా మలుచుకోవడానికి ఆమె ఈ వేదికను వాడుకున్నారు.తెలంగాణ రాజకీయాల్లో ఆత్మగౌరవం అనేది ఎప్పుడూ కీలకం. కవిత గారు తన నిర్ణయాన్ని తన వ్యక్తిగత గౌరవానికి మించి, తెలంగాణ ఆడబిడ్డల పౌరుషానికి, ఆత్మగౌరవానికి ముడిపెట్టారు. ఇది ఆమెకు కేవలం సానుభూతిని మాత్రమే కాదు, ఒక పోరాట పటిమ గల నాయకురాలిగా గుర్తింపును తెస్తుంది. బంధనాలు తెంచుకున్నాను అని చెప్పడం ద్వారా తాను ఎవరికీ లొంగని, స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగబోతున్నానని ఆమె ప్రకటించారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది, బీఆర్ఎస్ , బీజేపీలు ప్రతిపక్షంలో ఉన్నాయి. అయితే, ఒక బలమైన ప్రాంతీయ గొంతుక లేదా ప్రత్యామ్నాయ శక్తి కోసం చూస్తున్న వర్గాలను ఆకర్షించడానికి కవిత ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా సామాజిక తెలంగాణ కోరుకునే వారు, సెక్యులర్ భావజాలం ఉన్నవారు, యువతను లక్ష్యంగా చేసుకుని ఆమె తన అజెండాను ప్రకటించారు.కవిత ప్రాథమికంగా సానుభూతి వాతావరణాన్ని సృష్టించుకోవడంలో విజయవంతమయ్యారు. కానీ, రాజకీయాల్లో కేవలం కన్నీళ్లు లేదా ఎమోషనల్ స్పీచ్లు మాత్రమే గెలుపును అందించవు. ఆ సానుభూతిని క్షేత్రస్థాయిలో ఓట్లుగా మార్చగలిగే బలమైన కేడర్ , స్పష్టమైన రాజకీయ కార్యాచరణ ఆమెకు అవసరం. మె ఒంటరి పోరాటం ఎంతవరకు సఫలమవుతుందనేది రాబోయే రోజుల్లో ఆమె ప్రకటించే పార్టీ విధివిధానాలపై ఆధారపడి ఉంటుందని అనుకోవచ్చు.

# ఎన్నికలకు సిద్ధమవుతున్న పురపాలికలు

రంగారెడ్డి, జనవరి 7, మేడ్చల్ జిల్లాలో మున్సిపాలిటీలలో ఎన్నికల కొలాహలం మొదలైంది. జిల్లాలో ఎన్నికలు జరుగుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నప్పటికీ అధికారులు ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తుండడంతో ఆశావహులు సైతం సిద్ధమవుతున్నారు. జిల్లాలో కేవలం మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా ప్రత్యేక పరిస్థితుల్లో ఇటీవల ఏర్పడ్డాయి.గతంలో జిల్లాలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్ లు, 9 మున్సిపాలిటీలో ఉండేవి. ఇవి రింగురోడ్డు లోపల, రింగ్ రోడ్డు ని ఆనుకొని ఉండడంతో ప్రభుత్వం ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనం చేసింది. అంతకుముందు జిల్లాలోని గ్రామపంచాయతీలన్నీ మున్సిపాలిటీలలో విలీనం చేసింది. రింగ్ రోడ్డు బయట ఉన్న గ్రామాలను కలిపి ఎల్లంపేట, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలు ఏర్పాటు చేసింది. జిల్లాలో మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నందున ఇవి కూడా జిహెచ్ఎంసి లో కలుస్తాయనే ప్రచారం జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండడంతో పోటీకి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మూడు మున్సిపాలిటీలలో ఓటరు జాబితా ముసాయిదాలు వెల్లడించారు. ఓటరు జాబితా పై ఈ నెల 5 వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి అదే రోజు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈనెల 10వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికలలో ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీల గుర్తులతో జరుగుతాయి. పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు బీఫామ్ అవసరం. దీంతో ఆయా పార్టీల నియోజకవర్గ బాధ్యులను కలిసి తమ అంతరంగాన్ని వెల్లడిస్తున్నారు. ఈ మూడు మున్సిపాలిటీలు మేడ్చల్ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఎల్లంపేట, మూడు చింతలపల్లి లలో 24 వార్డులు చొప్పున, అలియాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి.పోటీ చేయాలనుకునేవారు గ్రౌండ్ వరకు కూడా చేసుకుంటున్నారు. పార్టీల నాయకులు సైతం కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకులు హరి వర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ నిర్వహించారు. వీరు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల క్రితం ఎంపీ ఈటెల రాజేందర్ బిజెపి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి అందరూ ఐక్యంగా ఉండి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలో రిజర్వేషన్లపై ఉత్కంఠ ఏర్పడింది. ఈ మూడు కొత్త మున్సిపాలిటీలలో ఛైర్మన్ పదవి, వార్డ్ మెంబర్ పదవులు ఏ కేటాగిరికి రిజర్వేషన్ అవుతుందనే విషయంలో ఆశావాహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్ సస్పెన్స్ ఉన్నప్పటికీ ఆశావహులు పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈ నెలలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని భావిస్తున్నారు.

# వేములవాడలోసంచార జాతుల సమ్మేళనం



వేములవాడ: సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో వేములవాడ పద్మావతి కల్యాణ మండపంలో వేములవాడలోని 12 సంచార జాతి కులాల కుటుంబాల సమ్మేళనం జరిగింది. దీనికి అఖిల భారత సమరసతా కళా విభాగం రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యంత నిరుపేదలు,రాజ్యాంగ ఫలాలు అందకుండా నిర్లక్ష్యం చేయబడిన ఈ సంచార జాతి కులాల పట్ల తరతరాలుగా వివక్షతకొనసాగుతున్నదని,అందువల్ల తెలంగాణాలో సంచార జాతి ప్రజల మధ్య సమరసాతా వేదిక సర్వే నిర్వహించి వారి సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తుందని చెప్పారు. సంచారా జాతి పిల్లలకు హైదరాబాద్ లో ఉచిత విద్య అందిస్తున్నామని తెలిపారు. చదువుకున్నప్పుడే సంచార జాతర కుటుంబాల్లో సరియైన జీవన వికాసం పెంపొందించుకుంటారని, సంచార జాతులకు నిజమైన రిజర్వేషన్లు ప్రతీక ఆర్థిక బడ్జెట్ రాష్ట్రం కేటాయించాలని పేర్కొన్నారు.అనంతరం రాష్ట్ర వైద్యుల సంఘం కార్యదర్శి డా సురేంద్ర బాబు మాట్లాడుతూ పిల్లల్ని చదివించాలని, బిక్షాటన మానెయ్యాలని,స్వాభిమానంగా బ్రతకాలని చెప్పారు. అనంతరం సంచార కుటుంబాలకి చలికాలం నుండి రక్షించుకోవడానికి 200 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేందర్ బాబు, కొల్లూరి రామారావు, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సంటి మహేష్, రాష్ట్ర నాయకులు గోపు బాలరాజు, సంతోష్ కుమార్, సామాజిక సమరసత కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్నర్ లో కార్...

హైదరాబాద్, జనవరి 7,నిన్నమొన్నటి వరకు ఆమె టార్గెట్ హరీశ్‌రావు. అప్పుడప్పుడు కేటీఆర్‌పై అటాక్. మధ్యలో సంతోష్‌పై సెటైర్లు. కానీ ఇప్పుడు అక్క..డైరెక్ట్‌గా గులాబీ బాస్‌పైనే బాణాలు ఎక్కు పెడుతోంది. పెద్ద సార్ టార్గెట్‌గానే..ఇంకా చెప్పాలంటే కల్వకుంట్ల ఫ్యామిలీ లక్ష్యంగానే ఆమె రాజకీయ పోరాటం ఉండబోతుందన్నది చెప్పకనే చెప్పేస్తోంది. కానీ కవిత కామెంట్స్‌పై కల్వకుంట్ల ఫ్యామిలీ నుంచి మాత్రం నో రియాక్షన్. కవిత రోజు రోజుకు డోస్ పెంచుతున్నా బీఆర్ఎస్ కీలక నేతలెవరూ స్పందించడం లేదు. ఇదే ఇప్పుడు కారు పార్టీలో హాట్ టాపిక్‌గా మారుతోంది.కారులో ఉన్నప్పుడే అందరినీ కార్నర్ చేసింది. ఒక్క అధినేతను వదిలిపెట్టి..హరీశ్, కేటీఆర్, సంతోష్‌ను..వరుసపెట్టి అటాక్ చేస్తూ వచ్చింది కవిత. ఇక బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాక..ఆమె విమర్శల దాడి ఇంకా ఎక్కువైంది. ఎక్కడికెళ్లినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులే టార్గెట్ గా ఆరోపణలు చేస్తూ వస్తున్నారు కవిత.అయినా హరీశ్, కేటీఆర్ సహా బీఆర్ఎస్ ముఖ్యనేతలెవరూ ఆమె కామెంట్స్‌పై అస్సలు రియాక్ట్ కావడం లేదు. లేటెస్ట్ మండలి వేదికగా కవిత మాట్లాడిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకు హరీష్ రావు, కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ ముఖ్యనేతలందరిపైనా విమర్శలు చేస్తూ వస్తున్న కవిత ఇప్పుడు మరింత స్పీడ్ పెంచారు. మొన్నటివరకు కేసీఆర్ దేవుడని, తన హీరో అని చెప్పిన కవిత..ఇప్పుడు ఆయనపైన ఇండైరెక్ట్ అటాక్ చేయడం చర్చకు దారితీస్తోంది.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు నేరుగా తీసుకోకపోయినా ఆయనపై విమర్శలు చేశారు కవిత. శాసనమండలి సాక్షిగా కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనపై సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయం అంటూ పరోక్షంగా కేసీఆర్‌ను కార్నర్ చేసే ప్రయత్నం చేశారు కవిత. తెలంగాణను ఏం ఉద్ధరించామని టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాలకు వెళ్లారంటూ మండలిలో ఉచ్చరించకూడని భాషతో తండ్రి కేసీఆర్‌ను ప్రశ్నించారామె.కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ పార్టీ, పాలనపై కవిత చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు, విమర్శలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముందు హరీశ్‌రావు, తర్వాత కేటీఆర్, ఇప్పుడు నేరుగా అధినేత కేసీఆర్‌ను అంటే మొత్తం కేసీఆర్ ఫ్యామిలీనే కవిత టార్గెట్ చేస్తున్నా..వాళ్లేవరు ఆమె కామెంట్స్‌పై ఎందుకు స్పందించడం లేదన్నది బీఆర్ఎస్ వర్గాల నుంచి ఎదురవుతున్న ప్రశ్న.కవిత వ్యాఖ్యలు, ఆమె చేసిన ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీకి ఎంతో కొంత నష్టాన్ని కలిగిస్తాయని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారట. ఆమె శాసన మండలిలో కన్నీళ్లు పెట్టుకుని మరీ అధినేత కేసీఆర్ సహా పార్టీపై, తొమ్మిదిన్నరేళ్ల పాలనపై ఆరోపణలు చేయడంపై గులాబీ లీడర్లు ఆందోళన చెందుతున్నారట. కవిత ఇంతలా సీరియస్ కామెంట్స్ చేసినా..అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఎందుకు రియాక్ట్ కావడం లేదన్నది బీఆర్ఎస్ నేతలకు, క్యాడర్‌కు అంతుచిక్కడం లేదట.కవిత వ్యాఖ్యలపై పార్టీ నుంచి ఎంత మంది మాట్లాడినా ఆ ముగ్గురిలో ఎవరో ఒకరు స్పందిస్తే ఎఫెక్ట్ వేరేగా ఉంటుందని చర్చించుకుంటున్నారట. లేకపోతే బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందంటున్నారు. ఇదే సమయంలో కవిత ఆరోపణలను అధినేత కేసీఆర్ కాకపోయినా కనీసం కేటీఆర్, హరీశ్‌రావు ఖండించకపోతే పార్టీకి నష్టం జరగడంతో పాటు ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు అస్త్రాలుగా మారతాయన్న ఆందోళన వ్యక్తమవుతోందటపార్టీ మహిళా నేతలతో కవితకు కౌంటర్ ఇప్పించినా అది ప్రజల్లోకి వెళ్లదని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై ఆమె ఆరోపణలు చేస్తున్నారు కాబట్టి వాళ్లు సమాధానం చెప్తేనే బాగుంటుందన్న ఒపీనియన్స్ వస్తున్నాయట. అయితే కవిత అంతలా ఫ్యామిలీ మెంబర్స్‌ను టార్గెట్ చేస్తున్నా వాళ్లు మౌనంగా ఉండటం వెనుక ఆంతర్యం వేరే ఉందన్న టాక్ వినిపిస్తోంది. కవిత ఎంత కాదనుకున్నా తమ కుటుంబ సభ్యురాలేనని, అధినేత కేసీఆర్ కూతురు కాబట్టి..ఆమె ఎన్ని ఆరోపణలు చేసినా కేటీఆర్, హరీశ్‌రావు మౌనంగా ఉండాల్సి వస్తోందట.కవిత ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో లేకున్నా తమ ఫ్యామిలీ మెంబరే కావడంతో ఆమెపై తాము మాట్లాడటం సరికాదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కవిత ఇలా అధినేత కేసీఆర్‌పైనా తీవ్ర ఆరోపణలు చేస్తున్నా మౌనంగా ఉంటే బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌తో పాటు జనంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో కవిత దూకుడు ఎలా ఉంటుందో..బీఆర్ఎస్ రియాక్షన్ ఇంకెలా ఉంటుందో వేచి చూడాలి.

# కోర్టుకు హాజరయిన మంత్రి లోకేష్



విశాఖపట్నం విశాఖ 12వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. తనపై సాక్షి పత్రిక ప్రచురించిన అసత్య కథనంపై మంత్రి నారా లోకేష్ పరువునష్టం దావా వేసారు. బుధవారం నాడు విశాఖ 12వ అదనపు జిల్లా న్యాయస్థానంలో క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. ఇప్పటికే ఈ కేసులో రెండు దఫాలు క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి అయ్యాయి. బుధవారం మూడోసారి క్రాస్ ఎగ్జామినేషన్ కు లాయర్లతో కలిసి మంత్రి లోకేష్ హాజరయ్యారు. చినబాబు చిరుతిండి.. 25 లక్షలండి' శీర్షికతో 2019, అక్టోబర్ 22న సాక్షి పత్రిక అసత్య కథనం రాసిందని లోకేష్ పిర్యాదు చేసారు.

# చిత్తూరు ప్రభుత్వం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

**ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని రకాల అభివృద్ధి చేసే అంశం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులను ఆదేశించిన చిత్తూరు ఎంపీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఉన్నతాధికారులకు సూచించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు, జిల్లా కలెక్టర్**



చిత్తూరు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగాలు, వార్డులను క్షుణ్ణంగా పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వార్డులలో వైద్య సేవలను పొందుతున్న రోగులను కూడా పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవలు వాటి వివరాలను, ఓపిగ్గా ఆరాదీశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఆధునిక యుగానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం అమలు పరిచే ఆధునిక వైద్యం పై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు , ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యాన్ని అందించాలని ఎంపీ తెలియజేశారు. అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని రకాల అభివృద్ధి చేసే అంశం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.మరి ముఖ్యంగా సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించి, వాటి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆశయాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యాధికారులు రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల పై నమ్మకం కలిగేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యాధికారులకు చిత్తూరు ఎంపీ సూచించారు.

# విశాఖ పార్టీ కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ 80వ రోజు ప్రజాదర్బార్

**ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి విజ్ఞప్తులు స్వీకరణ**

**ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని మంత్రి హామీ**

విశాఖపట్నం: విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 80వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేష్ ను కలిసేందుకు విశాఖ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వివిధ సమస్యలపై వారి నుంచి అర్జీలు స్వీకరించారు. విశాఖ 83వ డివిజన్ పరిధిలోని ఏఎంసీ కాలనీలో 192 కుటుంబాలకు రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన అపార్ట్ మెంట్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, ఇళ్లు పునర్ నిర్మించి తమను ఆదుకోవాలని కాలనీ వాసులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్థుల పిల్లల కోసం విశాఖలో కేర్ సెంటర్ నిర్మాణానికి స్థలం కేటాయింపుతో పాటు తగిన నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని విశాఖ కారుణ్య స్వచ్ఛాంధ్ర సేవా సంస్థ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం ముషిడిపల్లిలో యాదవ సామాజికవర్గానికి ఇళ్ల స్థలాలు కేటాయింపుతో పాటు కమ్యూనిటీ భవనం నిర్మించాలని గ్రామస్థులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఆధారం లేని తనకు కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని విశాఖ మద్దిలపాలెం కేఆర్ఎమ్ కాలనీకి చెందిన వెంపాడ స్తుతయ్య విజ్ఞప్తి చేశారు. వారసత్వంగా సంక్రమించిన భూమి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేయగా వీఆర్వో తిరస్కరించారని, విచారించి తగిన చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కే కోటపాడు మండలం, రామయోగి అగ్రహారానికి చెందిన నాగిరెడ్డి గొంగలయ్య కోరారు. ఆయా అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

# ప్రియురాలి మృతి తట్టకోలేక ప్రియుడి ఆత్మహత్య






రంగారెడ్డి యాచారం మండలం మేడిపల్లిలో దారుణం జరిగింది. 17 ఏళ్ల అమ్మాయి పూజ మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు, ఆదే గ్రామానికి చెందిన మహేష్ గత కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకున్నట్లు సమాచారం.పూజ కుటుంబ సభ్యులు మహేష్ ఇంటి ముందు ఆందోళన చెయ్యడంతో మహేష్ పరారయ్యాడు. పూజ మరణాన్ని తట్టుకోలేక బుధవారం మహేష్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణ పల్లి చెరువు సమీపంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పూజ కుటుంబ సభ్యులు గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి ప్రియుడు (మహేష్) ని అరెస్ట్ చేసి ఉంటే మరో ప్రాణం బలికాకుండా ఉండేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన. విద్యార్థులకు 'అరైవ్ అలైవ్'

గోదావరిఖని: స్థానిక మార్కండేయ కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు 'అరైవ్ అలైవ్' అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సి.ఐ. రాజేశ్వరరావు మరియు ఎస్.ఐ. హరి శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, రహదారి భద్రతా నియమాలను పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించడం ప్రాణరక్షణకు ఎంతో ముఖ్యమని వారు హితవు పలికారు.విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, వారు తమ కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయాలను తెలియజేయాలని కోరారు. పోలీసు అధికారుల అమూల్యమైన సూచనలతో ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా సాగి, విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనవరి 9వ తేది నుండి ఆన్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్లు జారీ


**నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా అమలు**

**తిరుమలలో ఆఫ్ లైన్ శ్రీవాణి దర్శన టికెట్ల జారీ నిలిపివేత**

యథావిధిగా ఇప్పటికే అమలులో ఉన్న శ్రీవాణి దర్శన టికెట్ల అడ్వాన్స్ బుకింగ్, తిరుపతి విమానాశ్రయంలోని ఆఫ్ లైన్ కరెంట్ బుకింగ్ విధానం

తిరుమల భక్తుల సౌకర్యార్థం, పరిపాలనా అవసరాల దృష్ట్యా టీటీడీ శ్రీవాణి దర్శన టికెట్ల జారీ విధానంలో మార్పులు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు తిరుమలలో ఆఫ్‌లైన్ కౌంటర్ల ద్వారా జారీ చేస్తున్న టికెట్లను జనవరి 9 నుండి రోజువారి ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానంలో కేటాయించనున్నారు.ఈ మేరకు తిరుమలలో రోజువారి విధానంలో ఆఫ్‌లైన్ ద్వారా జారీ చేస్తున్న 800 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్‌లైన్ ద్వారా రోజూవారి కరెంట్ బుకింగ్‌లోకి మార్చనున్నారు. ఈ టికెట్లను ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసి, మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంచుతారు. టికెట్ పొందిన భక్తులు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.ఒక్క కుటుంబానికి 1+3 సభ్యులు (మొత్తం నలుగురు) మాత్రమే టికెట్ బుకింగ్‌కు అనుమతి ఉంటుంది. టికెట్ల బుకింగ్ లో దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఆధార్ ధృవీకరణ, మొబైల్ నంబర్ వంటి వివరాలు తప్పనిసరి. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వడ్ విధానంలో భక్తులు టికెట్లు బుక్ చేసుకోవచ్చు. తద్వారా ఆఫ్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్ల కోసం భక్తులు క్యూలైన్ లో నిరీక్షించే సమస్య తొలగిపోతుంది. ఈ నూతన విధానాన్ని నెల రోజులపాటు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. అదేవిధంగా రోజుకు 500 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్ లైన్ అడ్వాన్స్ బుకింగ్ విధానంలో ఇప్పటికే విడుదల చేయడం జరిగింది. మూడు నెలల అనంతరం ఈ విధానంపై సమీక్షించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.తిరుపతి విమానాశ్రయంలో ప్రతిరోజూ భక్తులకు ఆఫ్ లైన్ విధానంలో జారీ చేస్తున్న 200 టికెట్ల జారీ విధానం కూడా యథావిధిగా కొనసాగనుంది.అన్ని వర్గాల భక్తులను దృష్టిలో ఉంచుకుని టీటీడీ తీసుకున్న నిర్ణయాన్ని గమనించి భక్తులు తమ దర్శన ప్రణాళికలను రూపొందించుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది.

# నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా అరెస్టు



తాండూరు కేంద్రంగా తొ నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ఓ ముఠా భాగోతం వెలుగుచూసింది. ఇంటర్నెట్ సెంటర్ నడుపుతున్న ఓ వ్యక్తి పలు మండలాల్లో ఏజెంట్లను పెట్టుకుని వారి ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఫేక్ సర్టిఫి కెట్లు, భూములకు సంబంధించి నకిలీ ఈసీలు తయారు చేసి అమాయకుల నుంచి రూ.లక్షలు దోచుకుంటు న్నాడు. ల్యాప్ టాప్ లో ఫొటో షాప్ ఆధారంగా నెట్లో ఒరిజినల్ సర్టిఫి కెట్లను డౌన్లోడ్ చేసుకొని వాటిలోని సమాచారాన్ని ఎడిట్ చేస్తూ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తయారు చేస్తున్నాడు. ఇవి ఫేక్ అని తెలుసుకున్న చివరకు బాధితులు బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. వారు రంగంలోకి దిగి జిరాక్స్ సెం టర్ నడుపుతున్న ముఠాలోని ఓ ఏజెంట్ను అరెస్టు చేసారు.

## శ్రీవారి సేవలో మారిషస్ దేశ అధ్యక్షుడు

తిరుమల మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోఖూ ల్ తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల స్వామి వారిని చేరుకు న్నారు. పద్మావతి అతిథి భవనం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, రిసెప్షన్ డిప్యూటీ ఈవో భాస్కర్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. తరువాత అయన వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకోని పూజలు చేశారు

## జీఎస్టి ఎగవేత కేసులపై చర్యలను ముమ్మరం చేసిన డిజిజిఐ

హైదరాబాద్ జీఎస్టీ ఎగవేత కేసులపై అధికారులు చర్యలు వేగవంతం చేసారు. ఆరెంజ్ ట్రావెల్స్, ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు జీఎస్టీని వసూలు చేసి ప్రభుత్వానికి అందజేయలేదని నిర్ధారించారు. ఆరెంజ్ ట్రావెల్స్ 28.24 కోట్లు, ట్రిలియన్ లీడ్ రూ.22 కోట్ల వరకు వసూలు చేసినట్లు గుర్తించారు. గడువు ముగిసిన మూడు నెలలైనా ఆరంజ్ ట్రావెల్స్, ట్రిలియన్ లీడ్ జీఎస్టీ కట్టలేదు. ఈ నేపధ్యంలో ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని సునీల్ కుమార్,ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ చేతన్ ను పోలీసులు అరెస్టు చేసారు. సిజిఎస్టి చట్టం 2017 నిబంధన కింద సునీల్ కుమార్, శ్రీ చేతన్ ఇద్దరిని అరెస్టు చేశారు


# ఏడు గేదేల చోరీ

వికారాబాద్ పరిగి మున్సిపల్ పరిధిలో పశువుల దొంగలు రెచ్చిపోయారు. మల్కాపూర్ శివారులో ఒ పొలం వద్ద ఉన్న షెడ్డులోంచి ఏకంగా ఏడు గేదేలను చోరీ చేసారు. బుధవారం ఉదయం పాలు పితకడానికి వచ్చి చూడగా గేదేలు లేకపోవడంతో రైతు అవాక్కైయాడు. ఓ భారీ వాహనం ఆ ప్రాతంలో తిరిగినట్టు ఆనవాళ్లు గుర్తించారు. పశువుల మెడలకు ఉన్న తాళ్ళను కోసి చోరీ చేసినట్లు గుర్తించారు. పాడి రైతు శివానంద్ పోలీసులు ఫిర్యాదు చేసాడు. గేదేల విలువ దాదాపు ఏడు లక్షలు ఉంటుందంటున్నాడు.

## దాసారం బస్తీలో ఎమ్మెల్యే తలసాని పర్యటన

హైదరాబాద్ మీరు ఎవరికి భయపడొద్దు. మీకు అండగా ఉంటామని మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ దాసారం బస్తీ గుడిసె వాసులకు భరోసా ఇచ్చారు. ఇటీవల సనత్ నగర్ లోని దాసారం బస్తీలో గుడిసె వాసులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి తమ గుడిసెలు ఖాళీ చేయాలని కొంతమంది వ్యక్తులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి దాసారం బస్తీలో పర్యటించి స్థానిక గుడిసె వాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం బ్రతుకు దెరువు కోసం నగరానికి వచ్చి ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరు నగరంలోని వివిధ ప్రాంతాలలో చెత్తను సేకరిస్తూ పారిశుధ్య నిర్వహణ తో పాటు జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. గుడిసెలు ఏర్పాటు చేసిన స్థలం మాది అని ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు వారు, మాదే ఈ స్థలం అంటూ కొందరు ప్రయివేట్ వ్యక్తులు గుడిసె వాసులను ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. 2014 లో తాను ఈ ప్రాంతం నుండి ఎమ్మెల్యే గా ఎన్నికైన తర్వాత గుడిసె వాసులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ వచ్చామని గుర్తు చేశారు. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో విద్యుత్, త్రాగునీటి సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడే ఉంటూ స్థానికంగా ఓటు హక్కును కూడా కలిగి ఉన్నారని వివరించారు. మీరు అంతా ఐక్యంగా ఉండాలని, ఎవరికి భయపడాల్సిన పని లేదని స్పష్టం చేశారు. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అవసరమైతే మీ తరపున న్యాయపోరాటం కూడా చేస్తామని ప్రకటించారు. మీ ఇల్లు, మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా మీతో పాటు మీ పరిసరాలలోని ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

# పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



పోలవరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్నారు. అయనకు పోలవరం ప్రాజెక్టు హెలిపాడ్ వద్ద మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. అంతకుముందు ఏరియల్ విజిట్ ద్వారా పోలవరం ప్రాజెక్టులో పనుల పురోగతిని సీఎం వీక్షించారు. వ్యూ పాయింట్ నుంచి స్పిల్ వే సహా మొత్తం ప్రాజెక్టును పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ సహా ఇతర నిర్మాణాలను అయన పరిశీలించారు.

# క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన అజారుద్దీన్



హైదరాబాద్ దేశంలో క్రికెట్ ఉన్నంత మోజు చెప్పలేనిది. అజారుద్దీన్ లాంటి గొప్ప వ్యక్తిని ఇండియా క్రికెట్ కు హైదరాబాద్ అందించిందని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. వి హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన రాజీవ్ గాంధీ ఆల్ ఇండియా అండర్ 19 టీ-ట్వంటీ క్రికెట్ ఛాంపియన్షిప్ ను క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అంబర్పేట్ వాటర్ వర్క్స్ గ్రౌండ్ లో టోర్నమెంట్ కు మహ్మద్ అజారుద్దీన్ హజరై హైదరాబాద్, బెంగళూరు టీంలకు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి అజారుద్దీన్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, అంబర్పేట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రోహిన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతా రోహిత్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా మహేష్ కుమార్ గౌడ్ హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్, ఎమ్మెల్యే శ్రీ గణేష్, రోహిన్ రెడ్డి కొద్దిసేపు క్రికెట్ ఆడి సందడి చేశారు.

ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్, వి హనుమంతరావు మాట్లాడుతూ

ఆటలకు ఆదరణ చాలా ఉందనీ, ఆటల పట్ల సీఎంకు చాలా మక్కువ ఉందన్నారు. సీఎం ఆటలకు ఎక్కువ ఆదరణ ఇస్తున్నారు విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ముఖ్యమని, విద్యార్థులకు శారీరక శ్రమ లేక మానసికంగా ఎదగలేకపోతున్నారన్నారు. క్రీడలు ఆడితేనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

# సీఎన్కే ల్యాబ్ పై అధికారుల దాడి

# పరారీలో ల్యాబ్ ఓనర్






హైదరాబాద్మంగళవారం అర్ధరాత్రి కాచిగూడ లోని సీఎన్కే ల్యాబ్స్ పై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు, ఈస్ట్ జోన్ పోలీసులు, క్లూస్ టీమ్ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ల్యాబ్ లోని సిబ్బందిని ప్రశ్నించి మేకలు, గొర్రెల రక్తం నిల్వలు, కొనుగోలు పత్రాలు, ఇతర రికార్డు లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ దందాలో కీలక సూత్రధారిగా భావిస్తున్న సీఎస్కే ల్యాబ్ ఓనర్ నికేశ్ రెండు రోజుల ముందే పారిపోయాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నికేశ్ దొరికితే ఈ దందాలో ఇంకా ఎవరెవరున్నారనేది బయటపడే అవకాశం ఉంది.

# హైదరాబాద్ మౌలానా ఉర్దూ యూనివర్శిటీ భూముల స్వాధీనానికి జిల్లా కలెక్టర్ నోటీసులు

## మండపడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



హైదరాబాద్ మౌలానా ఉర్దూ యూనివర్శిటీ లోని 50 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని నోటీసుల్లో కలెక్టర్ పేర్కొనడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేసారు. వేల కోట్ల రూపాయల విలువైన వర్శిటీ భూములను అమ్మి దోచుకోవాలనుకుంటున్నారా? కనీస సౌకర్యాలు కల్పించడం చేతగాని ప్రభుత్వం విద్యా సంస్థల భూములను అమ్ముకోవాలనుకుంటోందని ఆరోపించారు.

విద్యా సంస్థల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ సర్కార్ కు అల్టిమేటం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అన్యాక్రాంతమైన అనేక ప్రభుత్వ భూములున్నాయి. పాతబస్తీలో సల్కం చెరువును కబ్జా చేసి విద్యా వ్యాపారం చేస్తున్న ఒవైసీపై చర్యలేవి? వాటిని స్వాధీనం చేసుకుని ప్రజోపయోగ అవసరాలకు ఎందుకు ఉపయోగించడం లేదు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే వర్శిటీల, విద్యా సంస్థల భూములపై కన్నేయడం సిగ్గు చేటని అన్నారు. తక్షణమే సర్కార్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

## సురక్షితమైన ఆహారం ప్రజలకు అందేలా పర్యవేక్షణ చేయాలి




సిద్దిపేట సురక్షితమైన ఆహారం ప్రజలకు అందేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఫుడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. సురక్షితమైన మంచి ఆహారాన్ని ప్రజలకు అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. ముఖ్యంగా పాఠశాలలలో పనిచేసే వంట వారికి, చిన్న పిల్లలకు ఆహారం అందించే అంగన్వాడి కార్యకర్తలకు దశలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలలో మధ్యాహ్న భోజనం అందించే వారికి, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సదస్సులను నిర్వహించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా గల హోటల్స్, రెస్టారెంట్లు ఇతర ఆహర వ్యాపారులు విధిగా అనుమతులు పొంది నియమ నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. తనిఖీలలో భాగంగా నిత్యవసర పాలు, నూనెలు ఇతర పదార్థాలు తప్పనిసరిగా క్షుణ్ణంగా తనిఖీ చేసి వారి మీద శాఖ పరిరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు పాఠశాలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారి ద్వారా ఇంకా ఎక్కువమందికీ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆహారం చాలా ముఖ్య పాత్ర పోషిస్తున్నందున అధికారులు, ఆహార వ్యాపారులు ఇతర సంస్థలు నియమ నిబంధనలు పాటించి మంచి సురక్షితమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, హుస్నాబాద్ ఆర్టీవో రామ్మూర్తి, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి పి.అమృత శ్రీ. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, ఫుడ్ సేఫ్టీ అధికారి జయరాం, జిల్లా సంక్షేమ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైకాపా కో ఆర్డినేటర్ గా వడ్డి రఘురామ్ నాయుడు

## వడ్డి రఘురామ్ నివాసం వద్ద పార్టీ శ్రేణులు, అభిమానుల సంబరాలు



తాడేపల్లిగూడెం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ గా మాజీ ఆక్వాకల్చర్ కార్పొరేషన్ చైర్మన్ (క్యాబినెట్ ర్యాంక్), ప్రస్తుత వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం (ఆక్వాకల్చర్) వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు ని నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఈరోజు అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా సవిత్రు పేటలోని వడ్డి రఘురామ్ నివాసం వద్ద ఆయన అభిమానులు, నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని సంబరాలు చేసుకున్నారు. వడ్డి రఘురామ్ నాయకత్వం వర్ధిల్లాలి, జగన్మోహన్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తనను నమ్మి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జి గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియచేసారు. జగన్మోహన్ రెడ్డి తనమీద నమ్మకం ఉంచి, తనకు ఇచ్చిన బాధ్యతను పూర్తి బాధ్యతతో స్వీకరించి తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలంగా చేసే విధంగా ప్రతీ కార్యకర్త తలెత్తుకుని తిరిగే విధంగా చేసేందుకు కృషి చేస్తానన్నారు. వైసీపీ కార్యకర్తలు నాయకులు అందరూ కలిసి నియోజకవర్గంలో ఉన్న ప్రజా సమస్యలపై పోరాటం చేయాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ అంతా ఒక తాటిమీదకి వచ్చే విధంగా అందరిని కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లాను తీసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి..

## వాడలో తిరిగితే మున్సిపల్ అధికారుల అలసత్వం కనిపిస్తుంది... మాజీ ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్ భూపాలపల్లి. బస్తీబాటకార్యక్రమంలో భాగంగా బుధవారం జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు కార్లమార్క్స్ కాలనీ లో పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బస్తీ బాట కార్యక్రమంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ...భూపాలపల్లి ప్రాంతంలో గతంలో మంచినీటి సమస్య ఏ స్థాయిలో ఉందో అందరికీ తెలుసు. ఆ పరిస్థితిని గమనించి, పూర్తి స్థాయిలో సమస్యకు పరిష్కారం చూపిన నాయకత్వం కేసిఆర్ దే అని చెప్పక తప్పదు. ఈరోజు భూపాలపల్లి నియోజకవర్గం లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన గోదావరి జలాలు అందుతున్నాయంటే, అది కేసిఆర్ దూరదృష్టి గల పాలన ఫలితం. అదే విధంగా, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాను ప్రతి ఇంటికీ అందించిన ఘనత కూడా కేసిఆర్ ప్రభుత్వానికే దక్కుతుంది.కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేసిన ప్రభుత్వం ఇది.ఒకప్పుడు చిన్న గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న భూపాలపల్లి ఈరోజు జిల్లా స్థాయికి ఎదగడం, ఒక ఎస్పీ, ఒక కలెక్టర్తో పరిపాలన కొనసాగించగలగడం ఇవన్నీ కేసిఆర్ పాలనలో సాధ్యమయ్యాయి. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయాలనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విజ్ఞులైన భూపాలపల్లి పట్టణ ప్రజలు, జిల్లా ప్రజలు గమనించాలి. ఇలాంటి ప్రజావిరుద్ధ నిర్ణయాలకు భూపాలపల్లి ప్రజలు గట్టి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఈరోజు ఎంతైనా ఉంది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 33 జిల్లాలు ఏర్పాటు చేసి ఇప్పటికే పది సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇంత కాలం తర్వాత మళ్లీ జిల్లాలపై కొత్త ముచ్చట్లు ఎందుకు తెరపైకి తెస్తున్నారు? దీని వెనుక ఉద్దేశ్యం ఏమిటి? అనే ప్రశ్నలకు ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక చేయాల్సిన అవసరం ఉందని భూపాలపల్లి ప్రజలు గుర్తు చేస్తున్నారు.ఎన్నికల సమయంలో గెలవడం కోసం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు.అవన్నీ ఈరోజు అమలయ్యాయా అని ప్రజలు ఆలోచించాలి.ఇక్కడ ఉన్నా ఆడబిడ్డలను అడుగుతున్న నెలకు రూ.2500 ఇస్తామని చెప్పిర్రు కదా, ఇప్పటివరకు ఆ హామీ నెరవేరిందా?వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.4000 పెన్షన్ ఇస్తామని ప్రకటించారు, అది ఎక్కడ అమలైంది...? హామీలు ఇవ్వడం కాదు వాటిని అమలు చేయడమే అసలైన పాలన.భూపాలపల్లి ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు, అవసరమైతే సరైన సమయం లో సరైన సమాధానం ప్రజాస్వామ్య బద్ధంగా బదులు ఇస్తారని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.నేను ఇక్కడ మాటలతో కాలయాపన చేయడానికి రాలేదు.వాస్తవాలను మీకు చెప్పడం కొరకు వచ్చా..మన ముందే మీడియా మిత్రులు ఉన్నారు. ప్రజల గొంతును బయటకు తీసుకెళ్లే బాధ్యత ఈరోజు మీడియాపై కూడా ఉంది. ఈరోజు ప్రజల సమస్యలకు ఏ విధమైన పరిష్కారం చేయకుండా, అహంకారంతో, దురహంకార ధోరణితో పాలన సాగిస్తే ఈ నియోజకవర్గంలో వ్యవస్థ నడవదు అని స్పష్టంగా హెచ్చరిస్తున్నాం.ప్రజలను నిర్లక్ష్యం చేసి పాలన కొనసాగించడం ఇక సాధ్యం కాదు.రేపో మాపో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి ఇక్కడ ఉన్నా కొంతమంది నాయకులు ఇందిరమ్మ ఇళ్ళ లిస్ట్, పెన్షన్ లిస్ట్ తయారు చేసుకోని ఇగో ఎమ్మెల్యే సార్ సంతకం పెట్టిండు ఇగ మాకు ఓటు వేస్తె ఈ లిస్టులో పేరు ఉంటది లేదంటే నీకు ఏ పథకం రాదు అని బెదిరిస్తారు.మీరు భయపడవద్దు వచ్చిన వాళ్ళని గల్లా పట్టి గత రెండు ఏండ్లుగా ఎందుకు చేయలేదని మీరు ప్రశ్నించాల్సిన అవసరం ఉంది.అందుకే సోదర సోదరీమణులు ఈ విషయంపై ఆలోచన చేయాలి.ఈ 24వ వార్డులో గతంలో సీలింగ్ సర్ప్లస్ భూముల్లో మీరు అందరూ ఇళ్లను నిర్మించుకున్న సమయంలో, నేను ప్రభుత్వంతో పోరాడి మీ అందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ జరిగేలా చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాం. ఆ పోరాటాల ఫలితంగానే ఈ రోజు మీ హక్కులు మీకు వచ్చాయి, ఈ కాలనీలో మంచి అభివృద్ధి చెందడంతో పాటు మీ భూములకు మంచి ధరలు ఉన్నాయి. కాబట్టి అందరూ ఈ విషయాన్ని గుర్తుంచుకుని ఆలోచన చేయాలి.కేసీఆర్ తెలంగాణ హక్కుల కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేసి భూపాలపల్లి వంటి మారుమూల ప్రాంతాన్ని జిల్లా కేంద్రంగా అభివృద్ధి చేశారు. ఈ రోజు భూపాలపల్లి జిల్లాలో అభివృద్ధి ఎలా ఉందో ప్రతి ఒక్కరూ వచ్చి చూడవచ్చు.కలెక్టర్ కార్యాలయం కావచ్చు, డిగ్రీ కళాశాల కావచ్చు, జూనియర్ కళాశాల కావచ్చు, అంతేకాదు ఒక మెడికల్ కాలేజ్ కూడా భూపాలపల్లి వంటి మారుమూల ప్రాంతానికి రావడం అంటే ఇది చిన్న విషయం కాదు. గతంలో కేవలం ఒక సెంటర్గా ఉన్న భూపాలపల్లి, ఈ రోజు సూపర్ స్పెషాలిటీ డాక్టర్లతో కూడిన వైద్య సేవలు అందించే స్థాయికి ఎదిగింది.ఇలాంటి గొప్ప విద్యా వైద్య సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమయ్యాయి అనే విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.కాబట్టి మీరందరూ కూడా ఒకసారి ఆలోచన చేయాలి. గతంలో మొదలై ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మీకందరికీ తెలుసు. ఈ రోజు అంబేద్కర్ సెంటర్లో జరుగుతున్న కార్యక్రమాలను, అలాగే ఈనాడు పత్రికలో వచ్చిన వార్తలను గమనించాలి.భూపాలపల్లి పట్టణాభివృద్ధి కోసం నేను తెచ్చిన నిధులకు శంకుస్థాపనలు వేస్తావ్, టెండర్ పిలిచి పనులు ప్రారంభం అయిన వాటిని నీకు కాంట్రాక్టర్ మర్యాద చేయలేదని ఆ పనులు క్యాన్సిల్ చేసి నీ ఊరికి తీసుకెళ్ళి పట్టణాభివృద్ధిని అడ్డుకుంటున్నావ్. నిజంగా భూపాలపల్లిని అభివృద్ధి చేయాలనే సంకల్పం ఉంటే, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కొత్త నిధులు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్.ఈ రోజు ఈ ప్రభుత్వంలో రైతులు తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయం చేసుకునే రైతులకు యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారు.సాగునీటి సమస్యలు, విద్యుత్ సమస్యలు కూడా రైతులను వేధిస్తున్నాయి.ఈ కష్టాలు పోవాలంటే రైతుబంధు పథకం మళ్లీ అమలులోకి రావాలి అంటే, ఈ రోజు అధికార పార్టీ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు కాబట్టి రైతులకు న్యాయం జరగాలంటే అధికార పార్టీకి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అందుకే ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ను, కేసీఆర్ నాయకత్వాన్ని మరింత బలపరచాలి. అప్పుడే రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.అదే విధంగా మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి మెడలు వంచి ఇచ్చిన హామీలు అమలయ్యేలా చేసేందుకు భారత రాష్ట్ర సమితి పార్టీ ఎప్పుడు ప్రజలకి అండగా ఉంటుంది అని అన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్లో దొరికితే పనిష్మెంట్ ఇదే!

హైదరాబాద్ గత నెల 31న మైత్రివనం జంక్షన్ వద్ద జరిగిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారు నేడు సామాజిక సేవలో పాల్గొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు మొత్తం 18 మంది శిక్ష విధించారు. ఇందులో భాగంగా మైత్రివనం వద్ద సామాజిక సేవ చేస్తున్నారు. మద్యం తాగి వాహనం నడపడం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో పోలీసులు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

# మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

## కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్ మహిళలు తమ ఆత్మ గౌరవం కాపాడుకుంటూ అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ కళాభారతిలో డెమొక్రటిక్ సంఘ ఆధ్వర్యంలో జిల్లాలోని పలువురు మహిళా వార్డు సభ్యులకు సన్మానం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా కలెక్టర్, డెమొక్రటిక్ సంఘ కో ఫౌండర్, సినీనటి రెజీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. సుమారు 10 ఏళు గా రాష్ట్రంలో పనిచేస్తున్నానని..మహిళా పాలకులు ఉన్నచోట ప్రజా సమస్యలు తగ్గుముఖం పడుతున్నట్లు పేర్కొన్నారు.ఫౌండేషన్ సాయంతో మహిళలు ఎన్నికల్లో పోటీ చేసే విజయం సాధించడం అభినందనీయమని భవిష్యత్తులో మరిన్ని ఆకాంక్షలు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. అందరితో గౌరవంగా మెలుగుతూ ప్రజల కోసం కష్టపడి పనిచేస్తే మంచి పేరు దనంతట అదే వస్తుందని వివరించారు.తమ్ముడు, భర్త, తండ్రి, కుమారుడు చెప్పినట్లు చేయకుండా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని మహిళా వార్డు సభ్యులకు సూచించారు. సినీ హీరోయిన్, డెమొక్రటిక్ సంఘ కోఫౌండర్ రెజీనా కసాండ్రా మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంత మహిళల్లో అసాధారణ శక్తి ఉంటుందని.. సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి మహిళల ఆలోచనలు విన్నట్లు వివరించారు.గ్రామీణ ప్రాంత మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ఈ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం. ఈసారి పంచాయతీ ఎన్నికల్లో 25 మంది మహిళలకు ప్రోత్సాహం అందించగా.. 18 మంది నామినేషన్ దాఖలు చేశారని.. ఇందులో 11 మంది మహిళలు వార్డు సభ్యులుగా ఎన్నికైనట్లు ఫౌండేషన్ సభ్యులు వివరించారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లు ప్రజా సేవకులు.. పేరు

## చెడగొట్టుకోకండి..ఏసిపి నరేష్ రెడ్డి



కూకట్పల్లి (ప్రజాబలం) జనవరి 07సమాజంలో ఆటో డ్రైవర్లు అంటే చెడ్డ పేరు ఉంది కానీ నా దృష్టిలో ఆటో డ్రైవర్లు అంటే ప్రజా సేవకులు అని బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి అన్నారు.బాలానగర్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మీద అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే అక్కడ మొదటగా గుర్తుకు వచ్చేది ఆటో అని, బాధితులను ఆటోలో ఎక్కించేందుకు ప్రాధాన్యత ఇస్తామని గుర్తు చేశారు. 100 శాతం ప్రజలకు అనేక రకాలుగా ఉపయోగపడుతూ సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. గాంజా, మర్డర్, బ్రోతల్, దొంగతనం తదితర నేరాలకు సంబంధించిన కోణంలో చూస్తే ఆటోతోనే ముడిపడి ఉన్నాయని అన్నారు. ప్రయాణికుడు దేవుడితో సమానమని, ప్రయాణికులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మొదట ఆటో డ్రైవర్లది అని నొక్కి చెప్పారు. ఆటోలో ప్రయాణించేందుకు ముందుకు వస్తున్న మహిళల పట్ల అనుచితంగా వ్యవహరించకుండా మర్యాదతో వ్యవహరిస్తే బాగుంటుందని హితువు పలికారు. ఆటో డ్రైవర్లు అంటే గౌరవిస్తాం ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవాలని అందుకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాత్రి సమయాల్లో తిరిగే తోటి ఆటో డ్రైవర్ల పై సహచర ఆటో డ్రైవర్లు నిఘా పెట్టాల్సిన అవసరం చాలా ఉందని అన్నారు. అంతకు ముందు ఈ సందర్భంగా జీడిమెట్ల సిఐ మల్లేశం మాట్లాడుతూ ఎవరో ఒక ఆటో డ్రైవర్ చేసిన తప్పుకు అందరిని అదే కోణంలోనే చూడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని అన్నారు. అలా జరగకుండా ఉండాలి అంటే నేరం చేసే వాళ్ల గురించి సమాచారాన్ని తక్షణమే ఎప్పటికప్పుడు పోలీసులకు అందించాలని కోరారు. ఆటో డ్రైవర్లు నేరాలకు పాల్పడుతున్న కారణంగానే ప్రజలకు నమ్మకం పోయి ఓలా, ఉబర్ల లాంటి ఆన్లైన్ సేవలను ఆశ్రయించి క్షేమంగా వెళుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బాలానగర్ సీఐ నరసింహా రాజు మాట్లాడుతూ చాలావరకు ఆటో డ్రైవర్లు అనేక సంవత్సరాల సీనియారిటీ కలిగి ఉన్న వారని కొత్తగా ఆటోలు నడపడం లేదని అన్నారు. ఆటో డ్రైవర్ల కారణంగా జరుగుతున్న నేరాలకు సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం చాలా ఉందని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే ఆటో డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని అన్నారు. ఆటో డ్రైవర్లకు సంబంధించి ఎవరెవరికి లైసెన్సు ఉన్నాయి లేవు అనే విషయాలకు సంబంధించి ఒక లిస్టు తయారు చేసుకోనని పిలుపునిచ్చారు. పదవ తరగతి పాస్, లేదా ఫెయిల్ అయి ఉండాలని అన్నారు. వయసుతో సంబంధం లేకుండా ఓపెన్ ఎస్ఎస్సి ద్వారా అందరికీ పరీక్ష ఫీజు కట్టి పాసైన ఫెయిల్ అయిన వాళ్లకు ఒక సర్టిఫికెట్ వస్తుందని తద్వారా డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తు చేసుకోవచ్చని పిలుపునిచ్చారు. ఆర్థికంగా పేదవారైన కొంతమందికి మాత్రం తానే స్వయంగా ఫీజు కట్టి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించే ప్రయత్నం చేస్తానని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉంటే ప్రభుత్వం నుండి ఇన్సూరెన్స్, ఇతర సౌకర్యాలు అందుతాయని అన్నారు. ఆటోడ్రైవర్లు అడ్డాగా ఏర్పాటు చేసుకున్న ప్రాంతం నుండి ఒక లిస్టు తయారు చేయాలని కోరారు. ఒకరు ఇద్దరు ఫీజును తానే చెల్లిస్తానని మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమానికి పూనుకున్నట్లు తెలిపారు. ప్రతి ఆటో డ్రైవర్ కు యూనిఫామ్ ఉండాలి, బ్యాచ్ నెంబర్ కూడా ఉండాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్ లలో అత్యధిక శాతం ఎవరు కూడా యూనిఫామ్ ధరించడం లేదని అన్నారు. ఆటో డ్రైవర్లు అంతా పోలీసుల కనుసన్నల్లో ఉంటే వాళ్లందరికీ తగిన జాగ్రత్తలు, సూచనలు, సహకారాలు అంది ఇవ్వడానికి వీలవుతుందని పిలుపునిచ్చారు. స్థానికంగా ఆటో డ్రైవర్ లు అందరికీ సీరియల్ నెంబర్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు అంటే నమ్మకానికి మారుపేరని, అలాంటి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆటోలో ఎక్కడానికి యువతులు మహిళలు వస్తుంటారని వారందరినీ తమ కుటుంబంలోని వ్యక్తులుగా ఆదరించి గౌరవించి మర్యాదగా మాట్లాడాలని కోరారు. చిన్న చిన్న విషయాలతోనే చెడ్డ పేరు వస్తుందని గుర్తు చేశారు. సనత్ నగర్ సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ అధిక శాతం నేరాలు సెకండ్ హ్యాండ్ ద్వారా కొనుక్కున్న ఆటోల ద్వారానే అవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు 12 ఆటోలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఆటోలు కొనుక్కున్నవాళ్లు వారి పేరుమీదకు పేర్లు మార్చుకోవడం లేదని అన్నారు. ఆటో డ్రైవర్లు చెడ్డ పేరు తెచ్చుకొని మీ ఉపాధిని కోల్పోవద్దని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు ఒక ప్రొఫెషనల్ గా ఉండాలని కోరారు. ఒక్కసారి చెడు ముద్రపడితే దాన్ని చెడిపేసుకోవడం చాలా కష్టమని అన్నారు. ఇంటి దొంగతనాలు చేయడానికి ముఖ్యంగా నంబర్ ప్లేట్ లేని ఆటోలనే వాడుతున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్లు మీరు కూడా పోలీసులేనని అన్నారు. రోడ్డుకు అడ్డంగా ఆటోలు పెట్టరాదని కోరారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ సిఐ నరసింహారాజు, జీడిమెట్ల సిఐ చంద్రశేఖర్, సనత్ నగర్ సిఐ శ్రీనివాస్, బాలానగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ సక్రుం, ఎస్ఐ సరితా పటేల్ రెడ్డి, హాజీ మియా, ఆటో డ్రైవర్లు యూనియన్లు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై అవగాహన

## - ఉల్లంఘించిన వారికి జరిమానాలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా జనవరి 7(ప్రజాబలం ప్రతినిధి)**స్వచ్ఛ సర్వేక్షన్ 2025 లో భాగంగా సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టే దిశగా వివిధ వాణిజ్య వ్యాపార ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడినవి. నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్న మరియు విక్రయిస్తున్న వ్యాపారులపై జరిమానాలు విధించబడినవి.ఈ సందర్భంగా వ్యాపార వర్గాలు, దుకాణదారులకు ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి కలిగే నష్టాలపై అవగాహన కల్పించడంతో పాటు, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ నిబంధనలను వివరించారు. పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సిరిసిల్లను శుభ్రంగా నిలుపుకోవడానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ను పూర్తిగా నివారించి, గుడ్డ సంచులు, కాగితపు కవర్లు వంటి పర్యావరణహిత పదార్థాలను వినియోగించాలని మున్సిపాలిటీ అధికారులు వ్యాపారులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# పోష్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 07 :ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్ మెంట్ (పోష్)-2013 చట్టం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత,జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, స్థానిక, అంతర్గత ఫిర్యాదుల కమిటీల ప్రతినిధులు కవిత,శివ కీర్తి లతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు,మహిళ ఉద్యోగులతో పోష్ చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ పోష్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం,నివారణ, పరిష్కారంపై తెలుసుకోవాలని, మహిళల సంక్షేమం కొరకు ఈ చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు.జిల్లాలో స్థానిక, అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.మహిళలకు తాము పని చేసే ప్రదేశాలలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఈ కమిటీలను సంప్రదించవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో స్థానిక ఫిర్యాదుల కమిటీ కొనసాగుతుందని,కనీసం 10 మంది పని చేసే జిల్లా శాఖ కార్యాలయాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేసి జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయానికి వివరాలు తెలియజేసినట్లయితే ఆన్ లైన్ షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేయడం జరుగుతుందని,జిల్లాలో ఇప్పటివరకు 47 అంతర్గత ఫిర్యాదుల కమిటీలు కొనసాగుతున్నాయని తెలిపారు. అసంఘటిత రంగాలలో పని చేస్తున్న మహిళలు ఫిర్యాదు కొరకు స్థానిక కమిటీని సంప్రదించవచ్చని, ఈ కమిటీలలో ఫిర్యాదు చేసిన 90 రోజులలో విచారించిన తరువాత 10 రోజులలో ఫిర్యాదు నివేదికను సంబంధిత జిల్లా అధికారికి సమర్పించడం జరుగుతుందని, నివేదిక అందిన 6 నెలల సమయంలోగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదులో తుది తీర్పు సంతృప్తికరంగా లేనట్లయితే అప్పీలు కొరకు ట్రిబ్యునల్/ న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.లైంగిక వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పని ప్రదేశాలను మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కమిటీకి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఫిర్యాదులు చేసినట్లయితే సదరు ఫిర్యాదుదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటూ జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. సంఘటన జరిగిన 3 నెలల వ్యవధిలోగా ఫిర్యాదు చేయాలని, మహిళల సంక్షేమం కోసం హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 181 ఏర్పాటు చేయడం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం చట్టం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఎస్ కే ఆర్ ట్రస్ట్

## ద్వారాఆర్థిక సహాయం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 07 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి, మండల పరిధిలోగల బుచన్ పల్లి, గ్రామం లో సోమారం, గ్రామానికి చెందిన నర్సింలు, తల్లి,రసామ్మ మరణించిన, విషయం తెలుసుకొని, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఎస్, కె,అర్, ట్రస్టు ,అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మరియు జిల్లా ఉప అధ్యక్షుడు యూ, రవీందర్, మరియు గ్రామ సర్పంచ్ వెంకట్రామ్ రెడ్డి , ఉప సర్పంచ్ సేకులోదిన్, కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంటు జే, మహేందర్, ఆర్థిక సాయం 5,000,వేల రూపాయలు అందించారు పార్టీ సీనియరు నాయకులు కే శ్రీనివాసు రెడ్డి ,బాల్ వంతురెడ్డి ,ఏ. కిష్టయ్య. బి సంగమేశు ,బి జేగను, మోహన్రెడ్డి, బి బక్కారెడ్డి ,ఈ బల్లప్ప ,బి గోవర్ధన్ రెడ్డి, మరియు లోక శ్రీను, బి,రంగయ్యా ,బి రవి , పి,శ్రీను ,టి రాజు, ఎన్ ,రాములు, మరియు పార్టీ కార్య కర్తలు అందరూ కలిసి అందించారు.

# రైతు కూలి సంఘం నాయకుడు సుద్దపల్లి సుధాకర్ , శ్రీకాంత్ కోర్టులో హాజరు పర్చాలి

## సీపీఐ ( ఎమ్ ఎల్) పార్టీ జాతీయ కార్యదర్శి అజాద్



హైదరాబాద్ జనవరి 7 ()సిపిఐ ( ఎమ్ ఎల్) చంద్ర పుల్లారెడ్డి అనుబంధ సంఘం తెలంగాణ రైతు కూలి సంఘం అధ్యక్షుడు సుద్దపల్లి సుధాకర్ శ్రీకాంత్ లను నిన్న మధ్యానం సిరిసిల్ల పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు వారికి ఎలాంటి హాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరు పర్చాలని సిరిసిల్ల పోలీసులు అధికారులను సీపీఐ ( ఎమ్ ఎల్) పార్టీ జాతీయ కార్యదర్శి అజాద్ ఒక ప్రకటనలో కోరారు ,నేడు మావోయిస్టు,లొంగుబాటు,ఎన్కౌంటర్ నేపథ్యం లో ప్రజాస్వామ్య పద్ధతిలో నిత్యం ప్రజల మధ్య ప్రజా సమస్యల కోసం పని చేస్తున్నా రైతు కూలి సంఘం నాయకుడు సుద్దపల్లి సుధాకర్ , శ్రీకాంత్ ఇతరులను సిరిసిల్ల పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో వారి కుటుంబ సభ్యులు మానసిక ,బయపడుతున్నారు ,సుధాకర్, శ్రీకాంత్ ఆరోగ్యం తో లేరు కావునా వారిని వెంటనే కోర్టులో హాజరు పర్చాలని ఆయన కోరారు.

# ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు


## ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ప్రాక్టికల్స్

## జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులు 1,35,198

## మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి,



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జనవరి 7**:రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల వసతులు సమకూర్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ విషయంలో ఇప్పటి నుంచే పరీక్ష కేంద్రాలకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేంద్రరెడ్డి, అన్నారు. ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి మార్చి 18వ తేదీ వరకు జరగనున్న పరీక్షల నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లాసంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించార. బుధవారం అదనపు కలెక్టర్ విజయేంద్రరెడ్డి తన ఛాంబర్ లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు థియరీ, ఎథిక్స్, ఎన్విరాన్మెంటల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు రెండు సెషన్లలో మూడు స్పెల్స్లో జరుగుతాయని దీనికి గాను జిల్లా వ్యాప్తంగా జనరల్, ప్రాక్టికల్స్, ఒకేషనల్ కోర్సులకు పరీక్షలు ఉంటాయని అదనపు కలెక్టర్ విజయేంద్రరెడ్డి వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు గాను జిల్లాలో ప్రథమ సంవత్సరంలో జనరల్ విభాగానికి సంబంధించి 64780 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సుల్లో 1368 మంది.మొత్తం 66148 మంది పరీక్షలు రాస్తారని... అలాగే ద్వితీయ సంవత్సరంలో జనరల్లో 67792 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సుల్లో 1258 మొత్తం 69050 మంది పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో జనరల్ విభాగానికి సంబంధించి మొత్తం 1,32,572 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సుల్లో మొత్తం 2626 మంది మొత్తంగా 1,35,198 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ విజయేంద్రరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియోట్ పరీక్షలకు గాను 151 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీ కేంద్రాల నుండి జవాబు పత్రాలను పగడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలని, ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. దీనికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ విజయేంద్రరెడ్డి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్, కళాశాలల ప్రిన్సిపల్స్, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



INTERMEDIATE PUBLIC EXAMINATIONS, Feb/March 2026

THEORY EXAMINATIONS

| Day & Date | FIRST YEAR EXAMS Time: 9.00 A.M. to 12.00 Noon | Day & Date | SECOND YEAR EXAMS Time: 9.00 A.M. to 12.00 Noon |
|---|---|---|---|
| 25-02-2026 (Wednesday) | PART-II: 2nd LANGUAGE PAPER-I | 26-02-2026 (Thursday) | PART-II: 2nd LANGUAGE PAPER-II |
| 27-02-2026 (Friday) | PART-I: ENGLISH PAPER-I | 28-02-2026 (Saturday) | PART-I: ENGLISH PAPER-II |
| 02-03-2026 (Monday) | PART-III: MATHEMATICS PAPER-IA BOTANY PAPER-I POLITICAL SCIENCE PAPER-I | 04-03-2026 (Wednesday) | PART-III: MATHEMATICS PAPER-IIA BOTANY PAPER-II POLITICAL SCIENCE PAPER-II |
| 05-03-2026 (Thursday) | MATHEMATICS PAPER-IB ZOOLOGY PAPER-I HISTORY PAPER-I | 06-03-2026 (Friday) | MATHEMATICS PAPER-IIB ZOOLOGY PAPER-II HISTORY PAPER-II |
| 09-03-2026 (Monday) | PHYSICS PAPER-I ECONOMICS PAPER-I | 10-03-2026 (Tuesday) | PHYSICS PAPER-II ECONOMICS PAPER-II |
| 12-03-2026 (Thursday) | CHEMISTRY PAPER-I COMMERCE PAPER-I | 13-03-2026 (Friday) | CHEMISTRY PAPER-II COMMERCE PAPER-II |
| 14-03-2026 (Saturday) | PUBLIC ADMINISTRATION PAPER-I BRIDGE COURSE MATHS PAPER-I (FORBI.P.C. STUDENTS) | 16-03-2026 (Monday) | PUBLIC ADMINISTRATION PAPER-II BRIDGE COURSE MATHS PAPER-II (FORBI.P.C. STUDENTS) |
| 17-03-2026 (Tuesday) | MODERN LANGUAGE PAPER-I GEOGRAPHY PAPER-I | 18-03-2026 (Wednesday) | MODERN LANGUAGE PAPER-II GEOGRAPHY PAPER-II |

** The Government of Telangana, General Administration (SPL.E) Department, vide G.O.Rt.No.1715, dated 06-12-2025, has declared 03-03-2026 (Tuesday) as a General Holiday on account of Holi. **

# సెక్యూరిటీ గార్డ్‌పై ఘాతుకం: భయపెట్టి కొట్టి, నగదు, ఫోన్ దోపిడీ



**కూకట్పల్లి (ప్రజాబలం) జనవరి 07**:బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీకి పాల్పడిన ఒక ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాలానగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) సక్రమ్ తెలిపారు. వృద్ధుడైన సెక్యూరిటీ గార్డును భయపెట్టి, తీవ్రంగా కొట్టి అతడి వద్ద ఉన్న వస్తువులను దోచుకున్నట్లు ఆయన వివరించారు.

ఈ నెల 6వ తేదీన బాలానగర్, గౌతమ్ నగర్‌కు చెందిన రచ్చన్న (60) అనే సెక్యూరిటీ గార్డు, నర్సాపూర్ చౌరస్తా నుంచి సనత్ నగర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లడానికి ఆటో ఎక్కారు. ఈ సమయంలో, సోమల మల్లికార్జున్ అనే ఆటో డ్రైవర్ అతడిని తన ఆటోలో ఎక్కించుకున్నాడు.

బాలానగర్ పరిధిలోని వరుణ్ మోటార్స్ సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలోకి వెళ్లగానే, నిందితుడైన ఆటో డ్రైవర్ ఒక్కసారిగా ఆటోను ఆపాడు. రచ్చన్నను భయభ్రాంతులకు గురిచేసి, అతడి వద్ద ఉన్న రూ. 300 నగదు, సెల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నాడు. అడ్డుకోబోయిన రచ్చన్నను అత్యంత క్రూరంగా కొట్టడంతో అతడికి తీవ్ర రక్తస్రావమైంది. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు.

దీంతో బాధితుడు రచ్చన్న బాలానగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సహాయంతో ఆటో డ్రైవర్ సోమల మల్లికార్జున్‌ను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతడిని అరెస్టు చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు డీఐ సక్రమ్ తెలిపారు.


# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నాళం సతీష్



**ఖమ్మం ప్రతినిధి జనవరి 7 (ప్రజాబలం)** ఖమ్మం కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లందరూ నిన్న మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు డాక్టర్ తుమ్మల యుగంధర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా తుమ్మల యుగంధర్ ఆధ్వర్యం లో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నాళం సతీష్ ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని, ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించాలని ఆకాంక్షించారు ఖమ్మం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో చర్చించి, ప్రజల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఖమ్మం జిల్లాకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# భవిష్యత్తులో సెకండ్ యూనివర్సిటీగా సుల్తాన్పూర్ జేఎన్టీయూ క్యాంపస్

## మంత్రి దామోదర్ రాజనర్సింహ,




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 07 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** అందోల్ నియోజకవర్గం, చౌటకూర్, మండల పరిధిలోగల, సుల్తాన్పూర్ (జే,ఎన్,టి, యు ) క్యాంపస్ ను, భవిష్యత్తులో యూనివర్సిటీగా మార్చే అంశాన్ని,పరిశీలిస్తామని,రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, తెలిపారు, యూనివర్సిటీ ఏర్పాటుకు, అవసరమైన విశాలమైన ప్రాంగణం, అన్ని రకాల వసతులు,అప్లియేషనకు సరిపడా కాలేజీలు సంగారెడ్డి,మెదక్ జిల్లాలో, అందుబాటులో ఉన్నాయన్నారు, 2012,లో తాము అధికారంలో ఉన్నప్పుడు, (జె.ఎన్.టి.యు) క్యాంపస్ ను, సుల్తాన్పూర్ లో ఏర్పాటు చేయించానని, ఆకాలేజీని యూనివర్సిటీగా, అప్ గ్రేడ్ చేయాలన్న ఆలోచన, తనకు ఉందన్నారు, భవిష్యత్తులో ఆదిశగా చర్యలు తీసుకుంటామని, మంగళవారం శాసనమండలిలో, యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లుపై, చర్చ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు, సంగారెడ్డి జిల్లాలో అనేక పరిశ్రమలు ఉన్నాయని, ఇక్కడి పరిశ్రమలకు అవసరమైన స్కిల్డ్ కోర్సెస్, అందించే అద్భుతమైన యూనివర్సిటీని, భవిష్యత్తులో ఏర్పాటు చేసే ఆలోచన చేస్తామన్నారు......

# రోడ్డు ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 07 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** జోగిపేటలో అంబేద్కర్ చౌరస్తా వద్ద, వాహనాలను నిలిపివేసి, రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాలపై, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, జోగిపేట, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్, పాండు, ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, ప్రస్తుత పరిస్థితులు, జరుగుతున్న ప్రమాదాలను, దృష్టిలో పెట్టుకొని వాహనదారులు, జాగ్రత్తగా వాహనాలు నడిపి, ప్రమాదాలు జరగకుండా, జాగ్రత్తలు తీసుకోవాలని, అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.....

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 07** :మున్సిపల్ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు-కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు,మున్సిపల్ కమిషనర్లతో ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాల ప్రకటన, నామినేషన్ కేంద్రాలు, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లపై సమీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఎన్నికల నిర్వహణ చేపట్టాలని తెలిపారు. ఎన్నికల అధికారులకు విధుల కేటాయింపు, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు,ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు ఇతర ప్రతి అంశంపై పర్యవేక్షించాలని తెలిపారు.పోలింగ్ కేంద్రం పరిధిలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని,ఫోటో ఓటరు జాబితా సవరణ,పోలింగ్ కేంద్రాల వివరాల ప్రకటన,పోలింగ్ కేంద్రాల వారీగా ఫోటో ఓటరు జాబితాల ప్రకటనపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అర్హత గల ప్రతి ఒక్కరూ జాబితాలో ఉండేలా పర్యవేక్షించాలని,ఒకే కుటుంబానికి చెందిన అర్హత గల ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చే విధంగా చూడాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 117 మున్సిపాలిటీలు,6 మున్సిపల్ కార్పొరేషన్లలో 2వ సాధారణ ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని,రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మున్సిపల్ పరిధిలో పోలింగ్ కేంద్రాల జాబితా, ఫోటో ఓటర్ జాబితాలను ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.నామినేషన్ల స్వీకరణ కేంద్రం, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిపై విమర్శలను ఖండించిన బీఆర్ఎస్ నేతలు

అల్వాల్ బీజేపీ నాయకులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అల్వాల్ బిఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. అల్వాల్ బీజేపీ నాయకులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పై చేసిన విమర్శలను ఖండిస్తూ అల్వాల్ బిఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం నుండి నిధుల సమీకరణకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ఎంతగానో ఉందని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మల్కాజిగిరి నియోజకవర్గ సమస్యల పై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విక్రమార్కుడిలా నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. రైల్వే వలయంలోని సమస్యల పరిష్కారానికి ఆర్ యూ బి కోసం కృషి చేసారని కేంద్రం నుండి నిధులు సమీకరించి అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఏదైనా అనుమానం ఉంటే డిబేట్ కి సిద్ధం అని తెలిపారు.బీజేపీ నాయకులు నిజాలు తెలుసుకోకుండా ఏది పడితే అది మాట్లాడొద్దని హెచ్చరించారు. ఎమ్మెల్యే గురించి తప్పుగా మాట్లాడితే దేనికైనా సిద్ధం అని బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు.

# మీరు ఎవరికి భయపడొద్దు. హామీ ఇచ్చిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్!!!



**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) జనవరి 7** మీరు ఎవరికి భయపడొద్దు... మీకు అండగా ఉంటామని మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ దాసారం బస్తీ గుడిసె వాసులకు భరోసా ఇచ్చారు. ఇటీవల సనత్ నగర్ లోని దాసారం బస్తీలో గుడిసె వాసులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి తమ గుడిసెలు ఖాళీ చేయాలని కొంతమంది వ్యక్తులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం అధికారులతో కలిసి దాసారం బస్తీలో పర్యటించి స్థానిక గుడిసె వాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం బ్రతుకు దెరువు కోసం నగరానికి వచ్చి ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరు నగరంలోని వివిధ ప్రాంతాలలో చెత్తను సేకరిస్తూ పారిశుధ్య నిర్వహణ తో పాటు జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. గుడిసెలు ఏర్పాటు చేసిన స్థలం మాది అని ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు వారు, మాదే ఈ స్థలం అంటూ కొందరు ప్రయివేట్ వ్యక్తులు గుడిసె వాసులను ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. 2014 లో తాను ఈ ప్రాంతం నుండి ఎమ్మెల్యే గా ఎన్నికైన తర్వాత గుడిసె వాసులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ వచ్చామని గుర్తు చేశారు. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో విద్యుత్, త్రాగునీటి సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడే ఉంటూ స్థానికంగా ఓటు హక్కును కూడా కలిగి ఉన్నారని వివరించారు. మీరు అంతా ఐక్యంగా ఉండాలని, ఎవరికి భయపడాల్సిన పని లేదని స్పష్టం చేశారు. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అవసరమైతే మీ తరపున న్యాయపోరాటం కూడా చేస్తామని ప్రకటించారు. మీ ఇల్లు, మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా మీతో పాటు మీ పరిసరాలలోని ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అమీర్ పేట సర్కిల్ ఇజ సుజాత, టౌన్ ప్లానింగ్ ACP రమేష్, RI సుధీర్, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్ నగర్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, దాసారం బస్తీ వాసులు తిరుమలయ్య, తిమ్మన్న, నాయకులు సురేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సంతోష్ కుమార్, ఖలీల్, శేఖర్, రాజేష్ ముదిరాజ్, జమీర్ తదితరులు ఉన్నారు.



# శ్రీ బద్ది పోచమ్మ ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధాలయమైన శ్రీ బద్ది పోచమ్మ ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మరియు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశాల మేరకు సమ్మక్కసారలమ్మ జాతర ప్రారంభం కావడం, అలాగే వేములవాడ రాజన్న ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భారీగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ప్రాంగణంలో నూతన సిసి ఫ్లోర్, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు అవసరమైన చోట చలువ పందిళ్ళ ఆలయ వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమాదేవి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. భక్తులకు సులభంగా దర్శనం కల్పించే విధంగా ఏర్పాట్లను చేయాలని ఆమె ఆదేశించారు. అదేవిధంగా బుధవారం రోజున ఆలయంలో ప్రత్యేక పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆలయ శానిటేషన్ సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది సమన్వయంతో శుభ్రత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డి. ఈ. మైపాల్ రెడ్డి, ఏ ఈ ఓ జి .అశోక్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ టి. రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. రాజన్న భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.



## కలెక్టరేట్‌లో లూయిస్ బ్రెయిల్ 127వ జయంతి వేడుకలు



మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎన్ఐసి సమావేశ మందిరంలో లూయిస్ బ్రెయిల్ 127వ జయంతి వేడుకలను ఈ నెల 7వ తేదీన ఘనంగా నిర్వహించారు. దృష్టి లోపితులకు విద్యా, సమాచార ప్రాప్తిలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన బ్రెయిల్ లిపి ఆవిష్కర్త లూయిస్ బ్రెయిల్ అందించిన అమూల్య సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి సాంబశివ రావు, జిల్లా విద్య అధికారి (ఇజూా) విజయ కుమారి, ౹ాఎష్ట్రవఽబశ్రీవ ఝుర్వ సంక్షేమ శాఖ అధికారి (౹ాజ ఔవశ్రీఝతీవ), జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి (ఇఔ), దివ్యాంగుల సంక్షేమ సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు మరియు దృష్టి లోపితులు హాజరయ్యారు. వక్తలు లూయిస్ బ్రెయిల్ జీవితం, ఆయన చేసిన సేవలను వివరిస్తూ, దృష్టి లోపితుల విద్య, స్వావలంబన మరియు సమాన అవకాశాల కల్పనకు సమాజం మరింత కృషి చేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ 100 ఏళ్ల బహిరంగ సభను విజయవంతం చేయండి.

## ఖమ్మం గడ్డపై ఎర్ర జెండా కవాతు, వేములవాడలో 18న జరిగే సభ పోస్టర్ ఆవిష్కరణ.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18వ తేదీన ఖమ్మం పట్టణంలోని ఎస్సార్ అండ్ బిజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్ పిలుపునిచ్చారు. బుధవారం వేములవాడ పట్టణంలోని మహంకాళి చౌరస్తాలో సభకు సంబంధించిన పోస్టర్ ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద సుదర్శన్ మరియు వేములవాడ ఇంచార్జ్ కడారి రాములు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26 వ తేదీన భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు ప్రజల కోసమే నిరంతరం పోరాడుతుంది అన్నారు. స్వాతంత్ర ఉద్యమం, కార్మిక హక్కులు, మెరుగైన జీవన ప్రమాణాల కోసం ఎర్రజెండా ఎప్పుడూ ముందుంటుందని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగువేల మంది ప్రాణ త్యాగం చేసి, లక్షలాది ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిన ఘనత భారత కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశ సహజ సంపదను దోచిపెడుతుందని, ప్రశ్నించే గొంతులను అంచి వేయాలని చూస్తుందని వారు మండిపడ్డారు. జనవరి 18 రోజున జరిగే ఖమ్మం బహిరంగ సభకు 40 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారని, 15000 మంది జన సేవాదళ్ కార్యకర్తల కవాతు ఉంటుందని తెలిపారు. సుమారు 5 లక్షల మందితో జరగబోయే ఈ భారీ బహిరంగ సభకు రాజన్న సిరిసిల్ల జిల్లా నలుమూల నుండి కమ్యూనిస్టు పార్టీ అభిమానులు భారీగా తరలివచ్చి ఇట్టి భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అజ్జ వేణు, పట్టణ కార్యదర్శి ఎల్లా దేవరాజు, నాయకులు కోరేపు క్రాంతి, శ్రీరాముల నర్సయ్య, పెంట మల్లయ్య, దమ్మ లక్ష్మణ్, కడారి మల్లేష్, ఎంబర్ రాజు, బట్టు రఘు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## సొంత గూటికి యువనేత మద్దు కేంద్రమంత్రి బండి సంజయ్ సమక్షంలో బిజెపిలో ప్రశాంత్ చేరిక



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం జనవరి7** వీణవంక యువ నాయకుడు మద్దుల ప్రశాంత్ పటేల్ సొంతగూటికి చేరారు. బుధవారం ఆయన జమ్మికుంట లో కేంద్ర ం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమక్షంలో బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాషాయ పార్టీలో చేరారు. ప్రశాంత్ కు కేంద్రమంత్రి బండి సంజయ్ స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గంగాడి కృష్ణారెడ్డి బిజెపి కండువా కప్పి యువ నాయకుడు ప్రశాంత్ ను పార్టీలోకి ఆహ్వానించారు. ప్రశాంత్ గతంలో బిజెపిలో క్రియాశీలకంగా పనిచేసిన సంగతి తెలిసిందే. కరోనా కష్టకాలంతో పాటు ఇతర సందర్భాల్లోనూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా నిలిచిన మద్దుల ప్రశాంత్ పటేల్ బిజెపిలో చేరడంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు. బండి సంజయ్ నాయకత్వంలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ముందుకు సాగుతానని, ప్రజా శ్రేయసు యే ధ్యేయంగా పనిచేస్తానని ఈ సందర్భంగా బిజెపి నాయకుడు ప్రశాంత్ వెల్లడించారు. కార్యక్రమంలో బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ పుప్పాల రఘు,వీణవంక మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్,బిజెపి జిల్లా నాయకులు చెన్నమనేని నరసింహారాజు, రామిడి ఆదిరెడ్డి, గొడుగు వినోద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక ముఠాగా ఏర్పడి బెదిరింపులకు పాల్పడలనుకున్న నలుగురు వ్యక్తుల అరెస్ట్.

### వారి వద్ద 9ఎంఎం పిస్టల్,05 రౌండ్స్ స్వాధీనం. వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్.



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జనవరి 7 (ప్రజాబలం ప్రతినిధి)**ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన తోకల శ్రీకాంత్, దాసరి తిరుపతి, పయ్యలపు గోవర్ధన్ ,జగిత్యాల జిల్లాకు చెందిన మంజరి సురేందర్, అనే నలుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి జనశక్తి కార్యకలాపాల పేరుతో బెదిరింపులకు గురి చేయడం,డబ్బు వసూలు చేయడం,భూ వివాదాలలో జోక్యం చేసుకోవడం లాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొనడానికి ప్రయత్నిస్తున్నరన్న నమ్మదగిన సమాచారం మేరకు తంగళ్లపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అపి తనిఖీ చేయగా వీరి వద్ద ఒక్కటి 90 ఎంఎం పిస్తోల్ 05 రౌండ్స్ ఉండగా వాటిని స్వాధీన పర్చుకొని నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ప్రజలను బెదిరించడం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.నిందితుల యొక్క వివరాలు.1). తోకల శ్రీకాంత్ తండ్రి ,మల్లేశం, 34 సంవత్సరాలు, కులం: గొల్ల, గ్రామం:: రామన్నపల్లి,తంగళ్లపల్లి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా (గతంలో నిషేధిత జనశక్తి సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తి).2). దాసరి తిరుపతి తండ్రి, రాజయ్య, 43 సంవత్సరాలు, కులం:- తేనుగు, వృత్తి: ఆటో డ్రైవర్, గ్రామం:: సారంపల్లి, తంగళ్లపల్లి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా.3). వంజరి సురేందర్ అలియాస్ విశ్వనాథ్, అలియాస్ , బాదం సూర్య ప్రకాష్ రెడ్డి, తండ్రి, రాజమల్లు, వయస్సు:-57 సంవత్సరాలు, కులం: వంజరి, గ్రామం:: కుమ్మరిపల్లె, వెల్గటూర్ మండలం, జగిత్యాల జిల్లా (గతంలో నిషేధిత జనశక్తి సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తి).4). పయ్యావుల గోవర్ధన్ , తండ్రి ఎల్లయ్య, వయస్సు: - 31 సంవత్సరాలు, గ్రామం:: పెద్దలింగాపూర్ , ఇల్లంతకుంట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా. (గతంలో నిషేధిత జనశక్తి సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తి).ఎస్పీ వెంట సిరిసిల్ల రూరల్ సి.ఐ మొగిలి, టాస్కోర్స్ సి.ఐ నటేష్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవి, ఎస్.ఐ

# ప్రజల అవసరాల మేరకు సౌకర్యాల కల్పన

## రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక స్వామి





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 07 :** జిల్లాలో ప్రజల అవసరాల మేరకు సౌకర్యాలు కల్పించి జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ,కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.బుధవారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల కార్యచరణను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, మందమర్రి తహసిల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు,ఆర్.టి.సి.డి.ఎం.లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మందమర్రి ప్రాంత ప్రజల సౌకర్యార్థం మందమర్రి పట్టణంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్యచరణ ప్రారంభించడం జరిగిందని, బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ మందమర్రి ప్రాంతంలో ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంక్ మంజూరు చేయడం జరిగిందని, 2, 3 నెలలలో ప్రారంభించి సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణించేందుకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం జరిగిందని తెలిపారు. మందమర్రి నుండి హైదరాబాద్ కు బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, చెన్నూర్ నుండి హైదరాబాద్ కు అన్ని గ్రామాలను అనుసంధానం చేస్తూ 4 బస్సులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, చెన్నూర్ నుండి కాటారం, కాళేశ్వరం వరకు ప్రజల సౌకర్యార్థం బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని,ఈ క్రమంలో అవసరమైన అటవీ అనుమతులు పొంది పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు పాఠశాల సమయానికి ఇబ్బందులు లేకుండా బస్సుల రవాణాకు సహకరించాలని తెలిపారు. ఆర్థిక అభివృద్ధికి దాదాపు 20వేల కోట్ల రూపాయలు బ్యాంకు లింకేజీ, వడ్డీ లేని రుణ సదుపాయాలు కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం,నూతన రేషన్ కార్డులు, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.మందమర్రి మండలం రామకృష్ణాపూర్ లోని ఆర్. కె.1 ప్రాంతంలో 15 లక్షల రూపాయల 15వ ఆర్థిక సంఘ నిధులతో క్రిస్టియన్ స్మశాన వాటిక లో అంతర్గత రహదారి నిర్మాణం, వేచి ఉండు గది/ డ్రెస్సింగ్ రూమ్, ఫెన్సింగ్ ఇతర పనులకు క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు తో కలిసి శంకుస్థాపన చేశారు. సింగరేణి సి ఎం డి ద్వారా మంజూరు చేసుకుని 15 లక్షల రూపాయల వ్యయంతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు.. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి ఉన్నట్లయితే నిర్మాణం కొరకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు.క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పటిష్టమైన లైటింగ్ వ్యవస్థ కొరకు 40 లక్షల రూపాయల వ్యయంతో నూతన టవర్ వగన్ వెహికల్ ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లైటింగ్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని,ప్రతిరోజు పర్యవేక్షించాలని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో సౌర విద్యుత్ లైట్లను గ్రామాలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని,ఈ క్రమంలో ఇప్పటివరకు 30 లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, రామకృష్ణాపూర్ ప్రాంతం కొరకు 3 మంజూరు అయ్యాయని తెలిపారు.మున్సిపల్ పరిధిలో లే అవుట్లను సక్రమంగా చేపట్టి రహదారులు, మురుగు కాలువలు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నివాసానికి నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో అమృత్ పథకం క్రింద 40 కోట్ల రూపాయలతో త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు పనులు చేపట్టడం జరిగిందని, 4 నెలలలో పనులు పూర్తిచేసి త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.రామకృష్ణాపూర్ ప్రాంతంలోని ఠాగూర్ స్టేడియంలో కాకా వెంకటస్వామి మెమోరియల్ చేపట్టిన టి 20 లీగ్ క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల నుండి క్రీడాకారుల ప్రతిభ వెలికి తీసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2 సంవత్సరాల క్రితం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలలో దాదాపు 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. 17వ తేదీన హైదరాబాద్ లోని జింనా మైదానంలో తుది పోటీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తితో పోటీలలో పాల్గొని క్రీడాకారులకు ఏకాగ్రత పెబోతుందని తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో స్టేడియం కప్ నిర్వహణకు కృషి చేస్తామని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో ప్రజలలో శారీరక శ్రమ తగ్గిందని, తద్వారా అనారోగ్యాలకు గురవుతున్నారని, అంటు వ్యాధులను తట్టుకునే శక్తిని కోల్పోతున్నారని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటులకు గురై చిన్న పనులకు అలసిపోతున్నారని తెలిపారు. ఆటలు,క్రీడల ద్వారా ప్రతి ఒక్కరు శారీరక దారుఢ్యం, మానస ఉల్లాసం పొందుతారని, ఆత్మస్థైర్యం పెంపొందుతుందని తెలిపారు. నాయకత్వ లక్షణాలు, స్నేహభావం అలవాడతాయని, పనిలో ఏకాదశి పెరుగుతుందని తెలిపారు.క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో గల ఆర్ ఆర్ నగర్ లో 50 లక్షల రూపాయల 15వ పట్టణ ప్రగతి ఆర్థిక సంఘం నిధులతో హిందూ స్మశాన వాటిక,అంతర్గత రహదారి నిర్మాణం, వెయిటింగ్ హాల్/డ్రెస్సింగ్ రూమ్ పనులకు శంకుస్థాపన చేశారు.రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రతి మనిషి మరణించిన తర్వాత గౌరవంగా పంపించేందుకు స్మశాన వాటిక అవసరమని,ఈ క్రమం ప్రజల సౌకర్యార్థం 50 లక్షల రూపాయల వ్యయంతో హిందూ స్మశాన వాటిక ఏర్పాటు చేయడం జరుగుతుందని, అవసరం మేరకు 20, 30 లక్షల రూపాయలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్మశాన వాటికలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లైటింగ్,అంతర్గత రహదారులు,ఇతర అవసరాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేసిన హిందూ స్మశాన వాటిక పనులను 2 నెలలలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం లైటింగ్ ఏర్పాటు కొరకు మంజూరు చేసిన వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అన్ని వార్డులు, పబ్లిక్ ప్రాంతాలలో సోలార్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపాలిటీలలో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని, ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి.

## మంత్రి ధనసరి అనసూయ సీతక్క.





**ప్రజాబలం ములుగు జిల్లా ప్రతినిధి జనవరి 07 :** విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని,ఆదివాసీ గిరిజన విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యతను ప్రోత్సహించడం, ప్రతిభావంతులను గుర్తించడం, రాష్ట్ర స్థాయిలో అవకాశాలు కల్పించడమే 6వ రాష్ట్ర స్థాయి గిరిజన సంక్షేమ క్రీడా పోటీలు నిర్వహించే ముఖ్య ఉద్దేశం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ,గిరిజన కమిషన్ ఆధ్వర్యంలో ఐటిడిఏ ఏటూరునాగారం మండల కేంద్రంలోనీ జంబోరి మైదానంలో బుదవారం రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొని క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంబించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు, గిరిజన క్రీడాకారుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని వారి ఎదుగుదలకు, అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు.రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడా పోటీలు ములుగు జిల్లాలో నిర్వహించడం చాలా గర్వకారణం అని రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆటపాటలతో పాటు చదువు లో కూడా ప్రతిభ కనబరచాలని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ విద్యాలయాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మంచి ఫలితాలతో ముందుకు సాగుతున్నారని అదేవిధంగా రాబోయే టెన్త్ ఇంటర్ వార్షిక పరీక్షలలో ప్రథమ స్థానంలో ఉండేలా చదవాలని సూచించారు. విద్యార్థి దశలోనే శరీర దృఢత్వం అలవర్చుకోవాలని ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులు శ్రమదానం చేయడం, ఇతరులకు సహాయం చేయడం వంటి మంచి లక్షణాలు నేర్చుకోవాలని పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్, టెలివిజన్ కు ఆకర్షితులైన పిల్లలు మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వసతి గృహాలలో ఉండే పిల్లలు ప్రతిరోజు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ చదువుకోవాలని అన్నారు. క్రీడలలో గెలుపు ఓటమి సహజమని క్రీడలు స్నేహ పూర్వకంగా జరగాలని ఓడిపోయిన విద్యార్థులు తమలోపాలను తెలుసుకుంటూ రాబోయే క్రీడల్లో గెలుపు సాధించే విధంగా శ్రమించాలని , గెలుపొందిన విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని, గురువులను గౌరవించడం, పెద్దలను సంస్కారంతో మర్యాదపూర్వకంగా నమస్కారం అంటూ సంబోధించాలని, మ న్నత వ్యక్తుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలని, విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ చిత్రా మిశ్రా, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గిరిజన క్రీడా శాఖ అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పెటిక కులస్తులు అన్ని రంగాలలో రాణించాలి పెరిక సంఘం అధ్యక్షుడు బొడ్డు శంకర్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 07 :** మంచిర్యాల జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడు బొడ్డు శంకర్ పెటిక కులస్తులు అన్ని రంగాలలో రాణించాలని పెటిక సంగం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బొడ్డు శంకర్ పేర్కొన్నారు.బుధవారం మంచిర్యాల జిల్లా పెటిక సంఘం ఆధ్వర్యంలో లక్షేటిపేట పట్టణంలోని స్థానిక గుడ్ షేఫర్డ్ పాఠశాలలో 2026నూతన సంవత్సర క్యాలెండర్ ను అయన ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచులు,ఉప సర్పంచులు గా గెలిచిన పెరిక కుల నాయకులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెరిక కుల సంఘం నాయకులు మాట్లాడుతూ... మంచిర్యాల జిల్లాలో పెరిక కులస్తులు అన్ని రంగాలలో రాణించాలని,పెరికకుల సంఘ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బొడ్డు శంకర్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెరిక కులస్తులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com

Postel No. MBN/08/2016-2018


పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు, చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు వనమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు, ఊట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :21 సంచిక :182 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 పేజీలు :12 వేల రూ5 /-

# సంపాదకీయం

# సినిమా






# క్రీడలు






# ఆరోగ్యం





# వ్యాపారం



VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137




# నమస్తే

జాతీయ తెలుగు దినపత్రిక

NAMASTHE NEWS

NALGONDA I HYDERABAD I VIJAYAWADA I WARANGAL I KHAMMAM I KARIMNAGAR I GUNTUR I PRAKASAM I AMARAVATHI I RAJAMANDRI I KURNOOL I ANANTHAPURAM I TADEPALLIGUDEM I VISHAKAPATNAM I

నల్గొండ గురువారం 07 నవంబర్ 2024 ఎడిటర్: పగిడి లక్ష్మీనారాయణ సంపుటి : 7 సంచిక : 237 పేజీలు : 8 వెల : రూ. 2/-